RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 57 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి గురువారం 26-2-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥ దశమి రా॥ 12.43, మృగశిర మ ॥12.37, వర్జ్యం రా॥8.29 -9.59, దుర్ముహూర్తం ఉ॥10.20-11.06, శుభ సమయం ఉ॥ 9.00-10.30, రాహుకాలం మ॥1.30-3.00, సూర్యోదయం ఉ॥ 6.34, సూర్యాస్తమయం సా॥ 5.55 గం॥

**బిఎస్ఎన్ఎల్ డైరెక్టర్ కక్కుర్తి**

-ప్రయాగ్ రాజ్ పర్యటనలో వ్యక్తిగత పనులకు సిబ్బంది
-ఏర్పాట్లకు పురమాయించడంతో వైరల్
-షోకాజ్ నోటీస్ జారీచేసిన కేంద్రం

6లో

## గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి!

-దేశాన్ని మరింత ధృడంగా నిర్మించడమే లక్ష్యం
-ఇరాన్ అణు కార్యాక్రమాలతో అప్రమత్తంగా ఉన్నాం
-స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ సుదీర్ఘ ప్రసంగం



**వాషింగ్టన్,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవారం స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థికాభి వృద్ధి పరుగులు పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగుపడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదాసీదాగా ఉండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యూక్‌కు ప్రదానం చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత 9 మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చేరిందని పేర్కొన్నారు. 2028లో ఒలింపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ మిగతా 2లో..

## వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా!

వెలిగొండ పూర్తి కాకుండానే జగన్ రిబ్బన్ కట్ -పనులు పూర్తయ్యాయని దొంగమాటలతో మోసం
-పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి -ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశా
-వెలిగొండ ప్రాజెక్టు పనులు పరిశీలించిన సీఎం చంద్రబాబు నాయుడు



**మార్కాపురం,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. బుధవారం మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నా నని, అలాగే మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు. ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్‌రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5న ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళ్లు కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశం తనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం తనకు రాదని చెప్పుకొచ్చారు. 2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద మిగతా 2లో..

## యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు

-కేంద్రం చర్యను తప్పపట్టిన ప్రియాంక



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ యువ నేతలు భారత్-అమెరికా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. సమ్మిట్‌లో నిరసన చేసిన కాంగ్రెస్ నేతల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాం క గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టు సిగ్గుచేటని ఆమె ధ్వజమెతారు. 'సత్యం కోసం, శాంతియుత, అహింసాయుత ప్రతి ఘటన మనం గర్వించదగిన వారసత్వం. ఇది మహాత్మాగాంధీ, లక్షలాది మంది భారతీయుల పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలతో రాజీపడిన ప్రధానికి, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం పెంచడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజ నాలకు మంచిది. ప్రజల గొంతును పెంచినందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య తీవ్రంగా ఖండించదగినది. సిగ్గుచేటైన విషయం. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ యొక్క నిర్భయ సైనికులకు దృఢంగా అండగా నిలుస్తుంది' అని ఆమె బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. చేశారు. అని ప్రియాంక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, ఎఐ సదస్సులో షర్ట్ విప్పి నిరసన తెలిపిన ఘటనకు కీలక సూత్రధారిగా భావించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదరు భాను చిబ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఉదరు భానుతోపాటు మరో ఆరుగురు కాంగ్రెస్ కార్యకర్తల్ని అరెస్టు చేసి.. వారిపై అల్లర్లకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు.

## అందుబాటులో 2,721 డయాలసిస్ మిషన్లు

-మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి



**అమరావతి,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,721 డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. ఏపీలో డయాలసిస్ కేంద్రాల సంఖ్య పెంపుపై శాసనమండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానం ఇచ్చారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో డయాలసిస్ కేంద్రాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 14 కొత్త డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. గతంలో నెలకు సుమారు 40 వేల డయాలసిస్ సెషన్లు జరుగగా... ప్రస్తుతం 66 వేల సెషన్లకు పెరిగాయని మంత్రి తెలిపారు. 675 మంది పేషెంట్లకు నెలకు రూ.10 వేల చొప్పున పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. కిడ్నీ మార్పిడి చేసుకున్న రోగులకు కూడా పింఛన్లు అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. కిడ్నీ రోగుల చికిత్సపై సగటున రూ.86 వేల చొప్పున గత 20 నెలల్లో మొత్తం 224 కోట్లు ఖర్చు చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ పరిశీలనలో ఆడబిడ్డ నిధి పథకం

-మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి సమాధానం



**అమరావతి,ఫిబ్రవరి25 (ఆర్ఎన్ఎ):** ఆడబిడ్డ నిధి పథకం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల పింఛన్ల మొత్తాన్ని పెంచిందని మంత్రి వివరించారు. వృద్ధాప్య పింఛన్లను 3 వేల నుంచి రూ.4 వేలకు పెంచామని, ఏడాదికి రూ.33 వేల కోట్లు పింఛన్ల రూపంలో ఖర్చు చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ఏపీ శాసనమండలిలో 'ఆడబిడ్డ నిధి' పథకం అమలుపై వైసీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నలు లేవనెత్తారు. 'ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారు.. ఇచ్చే ఉద్దేశం ఉందా' అని ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు ప్రశ్నించారు. జూన్ 2024 నుంచే పథకాన్ని మిగతా 2లో..

## హెరిటేజ్‌కు వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఏం సంబంధం

-జగన్ చేసే ఆరోపణలకు సమాధానం చెప్పాలా
-బొత్స దృష్టిలో గజదొంగ అంటే జగనా
-మీడియా చాట్‌లో లోకేశ్



**అమరావతి,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** బాబాయ్‌ని చంపి కత్తి తమ చేతిలో పెట్టినట్లే.. వీఎస్ఆర్ ఏవియేషన్ విషయంలో వైకాపా ఆరోపణలు ఉన్నాయని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. మీడియా ప్రతినిధులతో మంత్రి లోకేశ్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదు. హెరిటేజ్ ఫిన్ లీస్ అనేది 1996లో స్థాపించిన సంస్థ. అనేక ఇతర సంస్థల మాదిరిగానే 2022లో హెరిటేజ్ ఫిన్ లీస్ వద్ద వీఎస్ఆర్ ఏవియేషన్ ఫైనాన్స్ తీసుకుంది. ఆరోజు మేము అధికారంలోకి వస్తామని, మా ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని కలగన్నామా? అజిత్ పవార్ వీఎస్ఆర్ ఫ్లైట్ ఎక్కుతారని.. అది ప్రమాదానికి గురవుతుందని ఊహించామా?. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకు నేను ఎందుకు సమాధానం చెప్పాలి? క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉన్న ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం చెబుతాం. వీఎస్ఆర్ ఏవియేషన్ వ్యవహారంపై పూర్తి వివరాలు అందిస్తా అని లోకేశ్ అన్నారు. చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగలను వదిలేస్తున్నారన్న బొత్స వ్యాఖ్యలపై కూడా లోకేశ్ స్పందించారు. జగన్ గజ మిగతా 2లో..

## బ్యాంక్‌లకు ఎగవేత కేసు

-అనిల్ అంబానీ నివాసం జప్తు

**ముంబై,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ముంబైలోని ఆయన విలాసవంతమైన నివాసం 'అబోడ్' ను తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ ఆస్తి విలువ రూ.3,716.83 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పాలిహిల్ ప్రాంతంలో ఉన్న ఈ భవనం 66 మీటర్ల ఎత్తు, 17 అంతస్తులతో లగ్జరీ టవర్‌గా పేరుంది. అంబానీ గ్రూప్ సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ కోట్లాది రూపాయల మేర బ్యాంకు రుణాల మోసానికి పాల్పడిన కేసులో ఈ జప్తు జరిగింది. దీంతో ఈ కేసులో ఇంతవరకూ జప్తు చేసిన అనిల్ అంబానీ ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది.ర్‌సీఓఎం మోసపూరిత బ్యాంకింగ్ డీలింగ్స్‌తో ఈ తాజా ప్రాపర్టీకి సంబంధం ఉందని ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. పీఎంఎల్‌ఏ కింద 2025 ఆగస్టులో అంబానీ స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డు చేసింది. త్వరలోనే మరోసారి ఆయనను ఈడీ ప్రశ్నించనుంది. అనిల్ అంబానీ ఆర్‌సీఓఎంపై తొలుత సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో దీనిపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది.

## అన్నాడిఎంకెతో సీట్ల పంపకాలు

-నేడు చెన్నైలో పళనిస్వామితో బిజెపి నేతల చర్చలు

**చెన్నై,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అన్నాడీఎంకేతో సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలకు బీజేపీ సమాయత్తమవుతోంది. ఇరు పార్టీల మధ్య గురువారంనాడు చర్చలు జరుగనున్నాయి. ఈ చర్చలకు బీజేపీ నుంచి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సారథ్యం వహించనుండగా, అన్నాడీఎంకే నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళని స్వామి, సీనియర్ నేతలు పాల్గొనున్నారు. కాగా, 2024 ఎన్నికల్లో తమ పార్టీ సాధించిన 11 శాతం ఓట్ షేర్ ఆధారంగా బీజేపీ బేరసారాలు జరుపనున్నట్టు తెలుస్తోంది. 50 సీట్లను బీజేపీ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్డీయే కూటమిలో బీజేపీతో పాటు టీటీవీ దినకరన్ 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే), మరో రెండు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన దినకరన్ 2018లో ఏఎంఎంకే పార్టీని స్థాపించారు. ఎన్డీయేలోకి తిరిగి రావడానికి బీజేపీనే కారణమని, ఆ పార్టీతోటే తాను సీట్ల సంప్రదింపులు సాగిస్తానని దినకరన్ స్పష్టం చేశారు. సీట్ల పంపకాలపై బీజేపీ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ, బీజేపీకి 35 సీట్లు, ఏఎంఎంకే వంటి ఇతరులకు 15 సీట్లను పార్టీ కేంద్ర నాయకత్వం కోరనుందని చెప్పారు. 2024లో పార్టీ పనితీరు ఆధారంగానే 2026 ఎన్నికల్లో సీట్ల పంపకాలు ఉండాలంటూ అన్నాడీఎంకే నాయకత్వానికి తెలియజేశామని, 2021లో ఇచ్చినట్టుగా 20 సీట్లు ఇస్తామంటే తాము అంగీకరించేది లేదని చెప్పారు. ఏఎంఎంకే 8 నుంచి 10 సీట్లలో పోటీ చేయాలనుకుంటోందని, ఏసీ షణ్ముగం 'న్యూ జస్టిస్ పార్టీ', జాన్ పాండియన్ 'తమిళగ మక్కల్ మున్నేట్ర గళం' చెరో రెండు సీట్లు ఆశిస్తున్నాయని, తక్కిన సీట్లు ఇతర పార్టీలకు బీజేపీ కేటాయిస్తుందని చెప్పారు. కాగా, 30 సీట్లకు తాము తగ్గేది లేదని, ఏఎంఎంకే 8 సీట్లయినా కావాలని గట్టిగా చెబుతోందని, దీంతో ఎన్డీయే మిగతా 2లో..

## 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి'

-పాఠ్యాంశంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు
-వెంటనే తొలగిస్తామని ప్రకటించిన కేంద్రం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయ వవస్థలో అవినీతి' అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం వెంటనే స్పందించింది. పాఠ్యాంశం లోని భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో న్యాయ వ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయ వ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది మిగతా 2లో..

## శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అరెస్ట్

**కొలంబో,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసులో శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున రాజధాని శివారులో రిటైర్డ్ మేజర్ జనరల్ సురేష్ సల్లేను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈస్టర్ ఆదివారం పేలుళ్లకు కుట్ర పన్నడం, సహాయం చేయడం, ప్రోత్సహించినందుకు ఆయనను అరెస్ట్ చేశారని అన్నారు. గోటబయ రాజపక్స అధ్యక్షుడైన తర్వాత 2019లో స్టేట్ ఇంటెలిజెన్స్ సర్వీస్(ఎస్ఐఎస్) చీఫ్‌గా సురేష్ పదోన్నతి పొందారని, ఆత్మాహుతి బాంబుదాడులకు సహకారం అందించారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. సురేష్ ఇస్లామిక్ బాంబర్లతో సంబంధం కలిగి ఉన్నాడని, దాడికి ముందు వారిని కలిశారని బ్రిటన్ మీడియా 2023లో వెల్లడించింది. 2019లో ఈస్టర్ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా జరిగిన బాంబు పేలుళ్లలో 45 మంది విదేశీయులు మరణించగా, 500 మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే.

**లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాసక్తుల్ని, లక్ష్య సాధనలో సైతం చూపించాలి, విజయ రహస్యమంతా ఇదే. పరాజయాలను పట్టించుకోకండి, అవి సర్వ సాధారణం, అవే జీవితానికి మెరుగులు దిద్దేవి.**

## నేటి మనదేశం సంపాదకీయం

# నాలగేళ్లయినా ముగియని ఉక్రెయిన్ సంక్షోభం!

ప్రపంచంలో ఏ యుద్ధాలను తీసుకున్నా నష్టపోతున్నది ప్రజలే. ఆయా దేశాలను ఆర్థికంగా నష్టపోతున్నాయి. ప్రపంచ దేశాలను నష్టాల కుంపట్లో పడేస్తున్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటింది. ఎందుకు యుద్ధం మొదలు పెట్టారో తెలియడం లేదు. అలాగని ముగింపు కూడా పలకడం లేదు. ఈ రావణ కాష్టం ఇప్పట్లో చల్లారేలా లేదు. అగ్రరాజ్యం తలచుకుంటే అంతే సంగతులని రష్యా నిరూపిస్తే.. అమెరికా నిజం చేసింది. రష్యా బాటలోనే అమెరికా కూడా అడపాదడపా దాడులతో ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకోవాలని చూస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భౌతిక దాడులతో పాటు, ఆర్థిక దాడులతో ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నారు. ఇకపోతే ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని ఉక్రెయిన్ అధినేత జెలెన్స్కీ చేష్టల కారణంగా రష్యాతో కయ్యానికి దిగారు. పుతిన్, జెలెన్స్కీ ఇద్దరూ బాగానే ఉన్నారు. కానీ ఇరు దేశాల ప్రజలు తీరని సంక్షోభంలో కూరుకు పోయాయరు. వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఫిబ్రవరి 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధం ఐదోయేట ప్రవేశించింది. దీనికి బాధ్యులైన నాటో కూటమి దేశాలు ఎలా, ఎప్పుడు ముగింపు పలుకుతాయో తెలియటం లేదు. నిజానికి ట్రంప్ కూడా ముగింపు చేసే సాహసం జరగడం లేదు. యుద్ధాలకు నేను ముగింపు పలుకుతున్నానని బీరాలు పలికిన ట్రంప్ ఈ యుద్ధాన్ని కూడా ఆపుతానని చెప్పినా, ఆ పని చేయలేక పోయారు. ఉక్రెయిన్ తాజా సంక్షోభానికి నాలుగేళ్లు నిండినప్పటికీ నిజానికి 2014 నుంచి ఈ అంతర్యుద్ధం కొనసాగుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపా ఖండంలో దీర్ఘకాలం సాగిన పోరుగా ఇప్పటికే చరిత్రలో ఉక్రెయిన్ సంక్షోభం నమోదైంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రపంచం మీద ప్రభావం చూపుతున్నది. ఏ దేశం కూడా ఎదుర్కోని తీవ్రమైన ఆంక్షలను రష్యా మీద నాటో కూటమి దేశాలు అమలు చేస్తున్నాయి. రష్యాతో వాణిజ్య లావాదేవీలు నిర్వహించే భారత్ తదితర దేశాల మీద కూడా అపరాధ పన్ను విధింపు, ఇతర చర్యలు తీసుకుంటామని అమెరికా బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనకుండా చేసిన ట్రంప్ ఎలా పెత్తనం సాగిస్తున్నాడో గమనించవచ్చు. ఇప్పటి వరకు ఉక్రెయిన్ పోరులో రెండు దేశాలకు జరిగిన నష్టాల గురించి పరస్పరం అతిశయోక్తులు తప్ప నిజానిజాలు వెల్లడి కావటం లేదు. రెండు వైపులా 20 లక్షల మంది సైనికులు గాయపడటం లేదా మరణించి ఉంటారన్నది ఒక అంచనా. 12.5 లక్షల మంది రష్యన్లు మరణించి నట్లు ఉక్రెయిన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సిఎస్ఐఎస్ అనే సంస్థ 3.25 లక్షల మంది మరణించటంతో సహా 12 లక్షల మంది రష్యా వైపు బాధితులు ఉన్నట్లు చెబుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏ పోరులోనూ ఇంత నష్టం జరగ లేదు. తమకు వ్యతిరేకంగా నాటో విస్తరణ పేరుతో ఉక్రెయిన్‌కు సభ్యత్వం మిచ్చి తమ ముంగిటకు అణ్వాయుధాలను మోహరించాలన్న అమెరికా ఎత్తుగడలను వమ్ము చేస్తూ గతంలో తన ప్రాంతంగా ఉన్న క్రిమియా ద్వీపాన్ని రష్యా ఆ ఏడాది విలీనం చేసుకుంది. ఉక్రెయిన్ పాలకులు అప్పటి నుంచి రష్యన్లు మెజారిటీగా ఉన్న తమ డాన్‌బాస్ ప్రాంతంపై దాడులకు మిలిటరీని దించారు. దానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో తలెత్తిన తిరుగుబాటుకు రష్యా మద్దతు ఇచ్చింది. సైనిక చర్య ప్రారంభించినప్పటి నుంచి నాలుగేళ్ల కాలంలో 26 శాతం ఉక్రెయిన్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మెల్లమెల్లగా కొత్త ప్రాంతాలకు చొచ్చుకుపోతున్నది. ఈ నాలుగేళ్ల యుద్ధ పర్యవసానాలను పరిశీలిస్తే ఇది అంత తేలికగా ముగిసేలా లేదు. పుతిన్ కూడా వదిలేలా లేరు. ఇప్పుడున్న యథాతథ స్థితిలో పోరు ముగించటానికి తాము సిద్ధమేనని, అయితే డాన్‌బాస్ తూర్పు ప్రాంతంలో తమ మిలిటరీ అక్కడే ఉండాలని జెలెన్స్కీ పట్టుబడుతున్నారు. ఉక్రెయిన్ తిరుగుబాటు ప్రాంతాలకు స్వాతంత్ర్యం ఇవ్వాలని, దాని మిలిటరీ బలం, ఆయుధాలను పరిమితం చేయాలని, మరేదేశ మిలిటరీ ఏ రూపంలోనూ ఉక్రెయిన్ గడ్డ మీద ఉండకూడదని పుతిన్ పునరుద్ఘాటిస్తున్నాడు. అయితే అమెరికా ప్రభావంలో ఉన్న జెలెన్స్కీ మాత్రం పాత సోవియట్ బంధాన్ని మరచి వ్యవహరించడమే యుద్ధానికి హేతువుగా గుర్తించాలి. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా, మిలిటరీ రవాణాకు కీలకమైన రైల్వేలు, రోడ్లు ఈ ప్రాంతంలోనే ఉన్నందున వాటిని వదులుకోనేందుకు పుతిన్ సిద్ధంగా లేడు. ఇకపోతే దాడుల కారణంగా ఉక్రెయిన్ జనాభా 4.2 కోట్ల మందిలో నాలుగో వంతు మంది ఇతర దేశాలకు తరలిపోయినట్లు చెబుతున్నారు. రష్యా ఆధీనంలోని ప్రాంతాలలో 50 లక్షల మంది నివశిస్తున్నారు. క్రిమియాతో సహా 26 శాతం భూభాగాన్ని ఉక్రెయిన్ కోల్పోయింది. అయితే జెలెన్స్కీ దళాలు తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తీసి వేస్తే ఆ మొత్తం 20 శాతానికి తగ్గినట్లు మరొక అంచనా. గత మూడు సంవత్సరాల్లో పెద్దగా రష్యన్లు ముందుకు పోలేదని మరి కొందరు చెబుతున్నారు. రష్యా సైనిక చర్య ప్రారంభం నుంచి నాలుగేళ్లలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. రష్యా ప్రధాన కేంద్రీకరణ మౌలిక సదుపాయాలను నాశనం చేయటం, ఆర్థిక మూలాలను దెబ్బ తీయటంపైనే కొనసాగుతున్నది. విద్యుత్ సరఫరా తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా ఫ్యాక్టరీలను నడిపేందుకు డీజిల్ జనరేటర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. మిలిటరీ చర్య ప్రారంభించిన తొలి రోజుల్లో పుతిన్ యంత్రాంగం వేసిన అంచనాలు దెబ్బతిన్నాయి. నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, ఆర్థిక సాయంతో పాటు రష్యన్ మిలిటరీ కదలికల గురించి కీలకమైన సమాచారాన్ని అందించటంతో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. దాంతో వ్యూహం మార్చుకోవాల్సి వచ్చింది. కొన్ని వారాల్లో కీవ్ పతనం అవుతుందన మాస్కో అంచనాలు తప్పాయి. రష్యా కోరిన విధంగా కొంత ప్రాంతాన్ని కోల్పోయి ఒప్పందం చేసుకుంటే సరే లేకపోతే ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని డోనాల్డ్ ట్రంప్ గతేడాది నవంబరులో బహిరంగంగానే చెప్పారు. గతేడాది ఇరాన్ మీద దాడులు, మరోసారి హెచ్చరికలు, వెనిజులా అధ్యక్షుడిని అపహరించిన డోనాల్డ్ ట్రంప్ రష్యా మీద చర్యకు ఎందుకు వెనకాడుతున్నట్లు అని కొందరు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రష్యా మీద ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ అవి పనిచేయటం లేదని ట్రంప్‌కు అర్థమైంది. మొత్తానికి ఈ రావణ కాష్టం చల్లారేలా లేదు. ఇరు దేశాలు కుర్చుంటేనే సయోధ్య కుదురుతుంది. అమెరికాలాంటి దేశాలు, నాటో జోక్యం వల్లనే ఇది మరింత ముదిరిందన్న సుస్పష్టం.

# మచిలీపట్నంలో పట్టపగలే భారీ దోపిడి

## టీచర్ ఇంట్లో 50 తులాల బంగారం, నగదు చోరీ

**మచిలీపట్నం,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. చిలకలపూడి సర్కార్ తోట ప్రాంతంలో ఓ ఉపాధ్యాయురాలి ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. గుడ్లవల్లేరు మండలం కౌతరం ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మార్గరెట్ బుధవారం ఉదయం తన ఇంటికి తాళాలు వేసుకొని పాఠశాలకు వెళ్లారు. రంజాన్ మాసం కావడంతో పాఠశాలకు మధ్యాహ్నం సెలవు ప్రకటించడంతో ఆమె ఇంటికి వచ్చారు. తలుపులు పగలగొట్టి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగిందని నిర్ధరించుకుని.. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దాదాపు 50 తులాల బంగారం, రూ.1,40,000 నగదు చోరీ జరిగినట్లు బాధితురాలు తెలిపారు.

# దొంగతనాలకు అలవాటు పడ్డ ఉద్యోగి

**విజయవాడ,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రూరల్ మండలం చిక్కుళ్లగూడెం గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడిని విజయవాడకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి అసిస్టెంట్ లైన్‌మెన్ నంద సుభాష్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద సుభాష్ చెడు వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే తిరువూరు మండలం గానుగపాడు గ్రామంలో బైక్ చోరీ చేశాడు. దొంగిలించిన బైక్‌పైనే వృద్ధురాలైన ఉప్పు అనసూర్య మెడలో 40 గ్రాముల బంగారు నాన్తాడు చైన్‌ను లాక్కెళ్లిపోయాడు. తిరువూరు సీఐ కే.గిరిబాబు నిందితుడిని లక్ష్మీపురం శివారులో అరెస్టు చేశారు. దొంగిలించిన బంగారంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# హైకోర్టులో ఐపిఎస్ అధికారి నాయక్ ముందస్తు బెయిల్

**అమరావతి,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** హైకోర్టులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ బుధవారం ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సునీల్ నాయక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. రఘురామ అరెస్ట్ సమయంలో ఏపీ సీఐడీ ఎస్పీగా ఆయన ఉన్నారు. రెండు రోజుల క్రితం నాయక్‌ను అరెస్ట్ చేసేందుకు ఎస్పీ దామోదర్ బిహార్ వెళ్లారు. ఈ క్రమంలోనే ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చేందుకు నిరాకరించింది బిహార్ కోర్టు. దీంతో ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు సునీల్ నాయక్. ముందస్తు బెయిల్ పిటిషన్ గురువారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# డయేరియా ప్రబలడంతో ఒకరు మృతి.. కమిషనర్‌పై వేటు

**అమరావతి,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. నగరంలో డయేరియా ప్రబలడంతో ఒకరు మృతిచెందగా.. 76 మంది ఆస్పత్రి పాలయ్యారు. విధుల్లో కమిషనర్ కూర్మారావు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలింది. దమ్మలవీధి, గోల్కొండ రేవు, కాకివీధి, మంగువారితోట తదితర ప్రాంతాలకు చెందినవారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరారు. మరోవైపు ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో ఇంటింటా సర్వే నిర్వహించింది. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి స్వల్ప లక్షణాలతో బాధపడుతున్న వారికి చికిత్స అందిస్తోంది. నగరపాలక సంస్థ సిబ్బంది ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేస్తున్నారు.

# వేంపల్లె నందీశ్వరాలయంలో ప్రతిష్ట.. ప్రత్యేక పూజల్లో వైఎస్ జగన్

**పులివెందుల,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** వైసిపి అధినేత వైఎస్ జగన్ రెండో రోజు పులివెందులలో పర్యటించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని వైఎస్ జగన్ సందర్శించారు. నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమంలో జగన్ పాల్గొన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ఆరు కోట్ల రూపాయలతో దేవాలయ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత.. వైఎస్ జగన్ మధ్యాహ్నం నుంచి క్యాంపు కార్యాలయంలో ప్రజదర్బార్ నిర్వహించనున్నారు. అయితే దీనికి ముందుగా పులివెందుల నివాసం నుంచి బయలుదేరిన వైఎస్ జగన్ వైఎస్ రాజారెడ్డి సోదరిని పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు.

# మచిలీపట్నం పాల కేంద్రాల్లో తనిఖీలు

**మచిలీపట్నం,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన కల్తీ పాల ఘటన నేపథ్యంలో ఏపీలోని వివిధ జిల్లాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల సరఫరా కేంద్రాలు, డైరీలపై తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పలు పాల కేంద్రాలపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సెంటర్, చిలకలపూడి ప్రాంతంలోని పాల కేంద్రాల్లోని పాలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు పరిశీలించారు. ఎస్.ఎస్ మిల్క్, జిల్లా పరిషత్ కృష్ణవేణి మిల్క్ డైరీ పాల కేంద్రాల నుంచి పాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్స్‌కు పంపించారు. కొన్ని కేంద్రాల్లో ఎమ్మార్పీ, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ లేని, అత్యధిక కాలం ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన బాదం పాల ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. రాజమహేంద్రవరం ఘటనలో కల్తీ పాలు తాగడం వల్ల పలువురు మృతి చెందగా.. మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

## మొదటి పేజీ తరువాయి

# వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా!



వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులని పరిశీలించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కెనాల్‌లో సీఎం చంద్రబాబు తిరిగారు. స్థానికంగా ఏఏ పంటలు పండిస్తున్నారో అన్నదాతలని అడిగి తెలుసుకున్నారు. లైనింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిలో వేగం పెంచాలని మార్గనిర్దేశర చేశారు. లలాగే, వెలిగొండ రెండో టన్నెల్‌లో పని చేస్తున్న ఇంజనీర్స్‌తో లైవ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టన్నెల్‌లో లైనింగ్ పనులని లైవ్‌లో పరిశీలించారు. జూన్ 15వ తేదీ నాటికి టన్నెల్‌లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తానని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రతి సోమవారం వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంచి చేసిన వారికి అండగా ఉంటేనే మీ జీవితాలు మారతాయి. ప్రతి విషయంలో మీకు అండగా చంద్రన్న ఉంటాడు. మార్కాపురం జిల్లాను ఉద్యానవనంగా తయారు చేస్తాం. పండ్లతోటల వల్ల రైతుల ఆదాయం బాగా పెరుగుతుంది. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించా. ఈ ఏడాది వెలిగొండపై దృష్టి పెట్టానని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి!

బ్యూటిపుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాలను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80 మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటినుంచి నేటివరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో అమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా విపులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయ సభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతి సుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు. ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టార్గెట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్ధానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.

# 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి'

కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. విద్యార్థులు కేవలం సిద్దాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# హెరిటేజ్‌కు విఎస్ఆర్ ఏవియేషన్‌కు ఏం సంబంధం

దొంగ అని బొత్స చెబుతున్నారా.. జగన్‌ను పట్టుకోవాలని చెబుతున్నారా..? అని ప్రశ్నించారు. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకి తానెందుకు సమాధానం చెప్పాలి..? అని నిలదీశారు. క్లారిటీ ఇవ్వాల్సిన అవసరమున్న ప్రతి ప్రశ్నకు ధీటైన సమాధానం తాము చెబుతామని పేర్కొన్నారు. జగన్‌ను పట్టుకోమని ఆయన చెబుతున్నారా? అని నిలదీశారు. సిట్ అధికారుల విచారణలో తేలిందంతా అదే కదా అని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో తమపై ఆరుకు పైగా కేసులు పెట్టారని.. ఫైబర్‌నెట్, స్కిల్, ఇన్నర్ రింగ్ రోడ్డు, లిక్కర్, ఇసుక, అసైన్‌మెంట్ భూములపై కేసులు పెట్టారని తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసేటప్పుడు కాంపిటెంట్ అథారిటీ నుంచి ఆమోదం పొందాలని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంత్రులకు అయితే గవర్నర్.. ఎమ్మెల్యేలు అయితే అసెంబ్లీ స్పీకర్ దగ్గర పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. గవర్నర్‌కు ఆధారాలు ఎందుకు చూపలేదని, ఒక్క ఆధారమైన చూపారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ హయాంలో పెట్టినవన్నీ తప్పుడు కేసులేనని ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేకు ఓ యూనివర్సిటీ పెట్టామని, రెసిడెన్షియల్ క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. రెండు రోజుల పాటు వారంతా పార్టీ కార్యాలయంలోనే ఓరియెంటేషన్ క్లాస్‌లో ఉండాలని సూచించారు. ఈ ఒరియేనీటేషన్‌కి ప్రిన్సిపాల్ సీఎం చంద్రబాబు అని ప్రస్తావించారు. తాము అంతా విద్యార్థులమేనని.. ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిగే సమావేశాలు.. రాజకీయాలకు అతీతమని... ఫ్యామిలీ కాన్సెప్ట్‌లోనే ఇది జరుగుతుందని వివరించారు. ఈ భేటీలో రాజకీయ ప్రస్తావన లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పరిశీలనలో ఆడబిడ్డ నిధి పథకం

అమలు చేస్తామని ఎన్నికల సమయంలో బాండ్లు ఇచ్చారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి గుర్తుచేశారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. మంత్రి సమాధానం ఇస్తున్న సమయంలో సభలో వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో సూటిగా చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పలు స్కీమ్‌లలో జరిగిన లోపాలను మంత్రి శ్రీనివాస్ చెబుతున్నారని తెలిపారు. చివరకు.. అధికార, విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే ఆ ప్రశ్నకు సమాధానం వచ్చినట్లుగా ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రకటించారు.

# అన్నాడిఎంకెతో సీట్ల పంపకాలు

బ్లాక్‌కు 40-50 సీట్లు కోరనున్నామని బీజేపీకి చెందిన మరో నేత తెలిపారు. కాగా, అన్నాడీఎంకే సొంతంగా 170 సీట్లలో పోటీ చేసేందుకు పట్టుదలగా ఉంది. బీజేపీకి 25, ఎన్డీయే బ్లాక్‌కు మరో 10 సీట్లు కేటాయించగలమని చెబుతోంది. పీఎంకేకు 17 నుంచి సీట్లు, ఒక రాజ్యసభ సీటు ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. బీజేపీకి 50 సీట్లు ఇవ్వడం చాలా కష్టమని, అయితే సంప్రదింపుల్లో ఆమోదయోగ్యమైన పరిష్కారం కుదురుతుందని ఆశిస్తున్నామని అన్నాడీఎంకే సీనియర్ నేత ఒకరు తెలిపారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్-మేలో జరుగనున్నాయి.


**వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్**

VASTU HOUSING FINANCE

యూనిట్ నెం. 203 & 204, 2వ అంతస్తు, "A" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబయి - 400015,మహారాష్ట్ర.
సీఐఎన్ నెం.: U65922MH2005PLC272501

**ఆస్తి స్వాధీన నోటీసు**

ఈ క్రింద సంతకం చేసిన నేను వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి గా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఆసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 ప్రకారం, అలాగే సెక్షన్ 13(12) తో పాటు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3 క్రింద నాకు కల్పించిన అధికారాలను వినియోగిస్తూ, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు సంబంధించి, ఆయా నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని, ఆ నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు చెల్లించవలసిందిగా డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.రుణగ్రహీతలు పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనందున, పై చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సంబంధిత నియమావళిలోని రూల్ 8 ప్రకారం నాకు కల్పించిన అధికారాలను వినియోగిస్తూ, క్రింద వివరించిన ఆస్తిని, క్రింద పేర్కొన్న తేదీన స్వాధీనం చేసుకోవడమైనది. కావున, ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు హామీదారులు, అలాగే సాధారణ, ప్రజలు ఎవరూ కూడా ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరపరాదని హెచ్చరించబడుచున్నది. ఈ ఆస్తికి సంబంధించిన ఏవైనా లావాదేవీలు,కింద పేర్కొన్న మొత్తం, దానిపై వడ్డీ, ఖర్చులు తదితరాలతో కలిసి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ శాఖకు ఉన్న బాధ్యతకు లోబడి ఉంటాయని తెలియజేయడమైనది.

| క్రమ నంబ్య | రుణగ్రహీత పేరు, సహ రుణగ్రహీత పేరు రుణ ఖాతా నంబ్య | డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం | ఆస్తి వివరణ | స్వాధీనం తీసుకున్న తేదీ మరియు విధానము |
|---|---|---|---|---|
| 1 | గీతాల భాస్కర్ రెడ్డి (ఋణగ్రహీత), గీతాల అన్నపూర్ణ (సహ ఋణగ్రహీత) LP0000000100156 | 17/నవంబర్/25 రూ. 1559345/- 12/నవంబర్/25 నాటికి | ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ఆత్మకూర్ సబ్-రెజి-స్ట్రార్ కార్యాలయం, ఆత్మకూర్ మున్సిపాలిటీ పాత ద్వారం నంబర్ 12-14, వార్డు నంబర్ 9 (కొత్త వార్డు నంబర్ 12), నాగేంద్రపురం/సందురేవు కాలువ, మున్సిపల్ ద్వారం నంబర్ 3/4/5/78, సర్వే నంబర్ 1031 లో 14½ అంకనాలు లేదా 116 చదరపు యార్డుల సైట్ స్థలం స్థిరంగా ఉంది, ఆంధ్రప్రదేశ్, 524344. సరిహద్దులు: ఉత్తరం - ఎగ్జిక్యూట్ చేసిన వారి సంయుక్త ఖాళీ స్థలం దక్షిణం - గీతాల వెంకటేశ్వరలూ రెడ్డి ఇంటి స్థలం తూర్పు - రోడ్ పడమరు - రోడ్ | ప్రతీకాత్మక స్వాధీనం తీసుకున్న తేదీ:24 ఫిబ్రవరి 2026 |

తేదీ : 26.02.2026
స్థలం : నెల్లూరు

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్



Truhome FINANCE

**ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
( ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ )

**డిమాండ్ నోటీస్**

**రిజిష్టర్డ్ ఆఫీస్ :** శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోరు నెం.5, పాత నెం.11, 2వ లేను, సెనటోఫ రోడ్డు, అల్వార్‌పేట, తేనంపేట చెన్నై-600018.
**ప్రధాన కార్యాలయము:** లెవెల్-3, వాకర్ట్ టవర్స్, ఈస్ట్‌వింగ్ సి-2 బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా(ఈస్ట్), ముంబాయి-400 051, **వెబ్‌సైట్ :** www.truhomefinance.in

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) నుండి పొందిన రుణ సౌకర్యాల అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో ఈ క్రింది రుణగ్రహీతలు విఫలం అయ్యారని మరియు పేర్కొన్న రుణ ఖాతాలను నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ)గా వర్గీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. సెక్యూరిటైజేషన్ మరియు రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI చట్టం)లోని సెక్షన్13(2) కింద వారికి డిమాండ్ నోటీసు జారీ చేయబడింది, వారు పేర్కొన్న చివరి చిరునామాకు పంపడమైనది, డిమాండ్ నోటీసుతో పాటు, వారికి ఈ పబ్లిక్ నోటీసు ద్వారా కూడా తెలియజేయుచున్నాము. రుణగ్రహీతలు, సెక్యూరిటీలు, బకాయిలు, సెక్షన్ 13(2) కింద పంపిన డిమాండ్ నోటీసుల వివరాలు మరియు అక్కడ క్లెయిమ్ చేయబడిన మొత్తం కింద ఇవ్వబడ్డాయి.

| రుణ గ్రహీత/సహ-రుణగ్రహీత పేరు & చిరునామా | సెక్యూర్డ్ అస్తుల యొక్క చిరునామా | డిమాండ్ నోటీస్ తేది & బాకీ ఉన్న సొమ్ము రూ. |
|---|---|---|
| శ్రీ బండి శ్రీనివాసులు, తండ్రి: సుబ్బన్న బండి శ్రీ బి.ఎస్. రామచందర్, తండ్రి: శ్రీ బండి శ్రీనివాసులు నివాసం: డోరు నెం. 3/146-14-4-2, వార్డు నం. 3, నీరుగట్టి వారి పల్లి మెయిన్ రోడ్, మదనపల్లి మున్సిపాలిటీ పరిధి, చిత్తూరు, ఆంధ్ర ప్రదేశ్ - 517325 రుణ మొత్తం: రూ. 48,30,293/- & రూ. 6,97,961/- ఎన్‌పిఎ తేదీ: 06-డిసెంబర్-2024 ఖాతా నం.: SLPHTRPT0000419/1 & STUHTRPT0000490/2 | డోర్ నం. 3-146-14-4-2, వార్డు నం. 3, సర్వే నం. 44, బండమీద కమ్మపల్లె గ్రామం, నీరుగట్టి వారి పల్లె మెయిన్ రోడ్, మదనపల్లి మున్సిపాలిటీ పరిధి, చిత్తూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ - 517325 లో ఉన్న భూమి మరియు భవనం మొత్తం. మార్కెట్‌కు ఎదురుగా ఉన్న ఈ స్థలం పై నిర్మాణ విస్తీర్ణం 3666 చదరపు అడుగులు మరియు భూమి విస్తీర్ణం 221.94 చదరపు గజాలు.సరిహద్దులు: తూర్పు: డి.నెం. 3-146-14-2-1 గల ఇల్లు ఉత్తరం: బి.ఎస్. రామచంద్ర గారి ఇల్లు పడమర: ఖాళీ స్థలం దక్షిణం: రహదారి | డిమాండ్ నోటీసు తేదీ: 04-02-2026 డిమాండ్ నోటీసు మొత్తం: రూ. 44,19,094/- (నలభై నాలుగు లక్షల పందొమ్మిది వేల తొంభై నాలుగు మాత్రమే) 31-01-2026 నాటికి, రుణ ఖాతా నం. SLPHTRPT0000419/1 సంబంధంగా మరియు రూ. 7,57,403/- (ఏడు లక్షల యాభై ఏడు వేల నాలుగు వందల మూడు మాత్రమే)31-01-2026 నాటికి, రుణ ఖాతా నం. STUHTRPT0000490/2 |
| శ్రీ మురళీధర్ రెడ్డి వై, తండ్రి: యెనుగుల గురునాథ రెడ్డి శ్రీమతి శైలజ వై, భర్త: శ్రీ మురళీధర్ రెడ్డి వై ఇంటి నం.: 79-156-హెచ్, కృష్ణా నగర్, నాగార్జున నగర్, తార్నాక, సికింద్రాబాద్, వెస్ట్ మారేడుపల్లి, ఆంధ్ర ప్రదేశ్, ఇండియా - 500017 రుణ మొత్తం: రూ. 12,26,094/- ఎన్‌పిఎ తేదీ: 05-జూన్-2025 ఖాతా నం.: SHLHKUNL0000086 | కర్నూలు మున్సిపాలిటీ పరిధిలో, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ పరిధి, కర్నూలు జిల్లా, కల్లూరు గ్రామం & మండలం, సర్వే నం. 334లో మున్సిపల్ అనుమతితో నిర్మితమైన "శిల్పా నందనవనం"లో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ నం. జి-24 (బ్రోచర్ ప్రకారం ఫ్లాట్ నం. 121). ఫ్లాట్ విస్తీర్ణం 1156 చదరపు అడుగులు మరియు మొత్తం 7623 చదరపు గజాల భూమిలో 47 చదరపు గజాల అవిభాజ్య హక్కు (1.57%) కలదు. సరిహద్దులు (ఫ్లాట్):, తూర్పు: స్టిల్ట్ ఫ్లోర్ స్లాబ్, ఉత్తరం: ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్ దక్షిణం: స్టిల్ట్ ఫ్లోర్ స్లాబ్, స్థల సరిహద్దులు: తూర్పు: సర్వే నం. 334 భూమి ఉత్తరం: సర్వే నం. 334 భూమి పడమర: సర్వే నం. 335 భూమి దక్షిణం: సర్వే నం. 334లో రహదారి ఫ్లాట్ కార్పెట్ ఏరియా: 1156 చదరపు అడుగులు (సాధారణ ప్రాంతంతో కలిపి) | డిమాండ్ నోటీసు తేదీ: 04-02-2026 డిమాండ్ నోటీసు మొత్తం: రూ.10,96,820/- (పది లక్షల తొంభై ఆరు వేల ఎనిమిది వందల ఇరవై మాత్రమే) 31-01-2026 నాటికి, రుణ ఖాతా నం. SHLHKUNL0000086 |

కాబట్టి రుణగ్రహీతలు ఈ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న విధంగా బకాయిలను వడ్డీ మరియు జరిమానా వడ్డీతో సహా చెల్లించాలని కోరుతున్నాము. అలా చెల్లించని యెడల, దిగువ సంతకం చేసిన వ్యక్తి SARFAESI చట్టం కింద చర్య తీసుకోవలసి ఉంటుంది. పైన పేర్కొన్న సెక్యూరిటీలను అమలు చేయడానికి, దయచేసి గమనించండి, ఆ చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, పైన పేర్కొన్న సెక్యూరిటీలను మా అనుమతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా బదిలీ చేయకుండా మీరు నిరోధించబడ్డారు.

స్థలం : మదనపల్లి, కర్నూలు
తేది : 26-02-2026

సం/- అధీకృత అధికారి - ట్రూహోమ్స్ ఫైనాన్స్ లిమిటెడ్
(ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

# తిరుపతి జిల్లా

## ఆర్తులకు అండగా సీఎం సహాయనిధి: ఎంపి



**నగరి, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్తులకు అండగా నిలుస్తోందని పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్తులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. సుమారు రూ.6 లక్షలు విలువ చేసే సీయంఆర్ఎఫ్ చెక్కులను 10 బాధిత కుటుంబాలకు ఎంపీ కార్యాలయంలో పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ అందజేసి, వారిలో స్థైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎంపి దగ్గుమళ్ళ మాట్లాడుతూ.. ఉన్నత ఆశయంతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని కొనియాడారు. పేదరికం లేని సమాజ స్థాపనే సంకల్పంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే పలు వ్యాధులతో బాధపడే వారికి, ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుకుంటూ, వారిలో స్థైర్యాన్ని కోల్పోకుండా ఉండటానికి తగు జాగ్రత్తా చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలియజేశారు. ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పాలనా దక్షతకు నిదర్శనమని సీఎం సేవలను ప్రశంసించారు.

## శ్రీసిటీ పరిశ్రమచే పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



**శ్రీసిటీ/వరదయ్యపాలెం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాకవర్త్ పరిశ్రమ వితరణతో ఇరుగుళం, మాదనపాళెం, అరవపాళెం జడ్పీ హైస్కూళ్లకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. మార్చి 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, పరీక్షలు వ్రాయడం కోసం ఒక్కో విద్యార్థికి ఒక రైటింగ్ ప్యాడ్, రెండు పెన్నులు, జామెంట్రీ బాక్స్ చొప్పున మొత్తం 130 మంది విద్యార్థులకు మెటీరియల్ అందచేశారు. ఆయా స్కూళ్ల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో రాకవర్త్ ప్లాంట్ హెడ్ శ్రీరామ్, కంపెనీ సిబ్బంది చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. రాకవర్త్ చొరవను అభినందించిన శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలలో చదివే ప్రతి విద్యార్థికి అన్ని రకాల విద్యావసతులు అందాలన్న లక్ష్యంతో స్థానిక పరిశ్రమల భాగస్వామ్యంతో తాము పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సహకారం నిరంతరంగా కొనసాగుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం శ్రీసిటీ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రశంసిస్తూ, శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా కాళిపీఠం ఆలయంలో లక్ష కుంకుమార్చన



**చంద్రగిరి, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం లోని తొండవాడ గ్రామంలో ఉన్న శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా కాళిపీఠం ఆలయంలో 17వ వార్షిక మహోత్సవం సందర్భంగా లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి సూరిస్వామి మాట్లాడు తూ ఉత్సవాలలో రెండవ రోజు బుధవారం ఉదయం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వేద పండితులు జి.సీతారామ శర్మ బృందంచే ప్రాతఃకాలార్చన, ప్రత్యం గిరా మూల మంత్ర హోమాలు, శరభేశ్వర హోమం నిర్వహించి, అత్యంత పవిత్రమైన లక్ష కుంకు మార్చన కార్యక్రమం ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం అమ్మవారికి నైవేద్యం, హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 5 గంటలకు లక్ష కుంకుమార్చన పూర్తిచేశారు. అనంతరం ప్రదోష కాల పూజ నిర్వహించి, నైవేద్యం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదం అందజేశారు. కార్యక్రమానికి ఉభయ దారులుగా బుచ్చినాయుడు పల్లి సర్పంచ్ యం.రవి నాయుడు, చంద్రగిరి అంతరంగిక భక్తులు వ్యవహరించారు. వీరికి ఆలయ కార్య నిర్వాహకులు పూజారి శివశంకర ప్రసాద్, వడ్డీ కాసుల రామ్మూర్తి నాయుడు తీర్థప్రసాదాలు ఇచ్చి సత్కరించారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

**- ముఖ్య అతిథులుగా షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు పి వెంకటప్ప**

**అనంతపురం,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మడకశిర పట్టణంలో భారీ జనసంద్రమున స్థానిక గిరిజన నాయకులు గిరిజన నేతలతో కలిసి మధుగిరి రోడ్డు లోని సంత్ సేవాలాల్ మహారాజు విగ్రహానికి భూమి పూజ చేశారు. లంబాడా బంజారా సోదరులతో కలిసి ఎస్టి కమిషన్ సభ్యులు వెంకటప్పకి స్వాగతం పలుకుతూ భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీ కార్యక్రమంతో మధుగిరి రోడ్డు నుంచి అంబేద్కర్ సర్కిల్, సాయిబాబా టెంపుల్ వరకు భారీగా ర్యాలీగా వస్తు సాయిబాబా టెంపుల్ వద్ద భారీ బహిరంగ సభకు విచ్చేశారు. గోర్ బంజారా బంజారా నాయకులు సంత్ సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు అర్పించి పూజా కార్యక్రమం నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేస్తూ భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ సంత్ సేవలాల్ జయంతి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించిందన్నారు. రాష్ట్రంలో గిరిజన తండాలకు రోడ్లు మౌలిక వసతులు ఇతర అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ గిరిజనులకు ఏమైనా సమస్య వస్తే 24/7 ఏపీ ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని తెలియజేశారు. రాష్ట్రంలో ఏ గిరిజనులకు అన్యాయం జరిగిన కమిషన్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఉమాదేవి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు, తెలుగుదేశం పార్టీ స్టేట్ సెక్రటరీ శ్రీనివాసమూర్తి, నాగరాజు, చక్రి, నాయక్, వెంకటేష్, నాయక్, లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి రాష్ట్రసోసియేషన్ ప్రెసిడెంట్, సబ్ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, రాష్ట్ర అధ్యక్షులు లోక్యానాయక్ పాల్గొన్నారు.

## నీటిలో రసాయనాల కలుషితంపై చర్యలు తీసుకోండి: సీపీఐ

**నగరి, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డయింగ్ యూనిట్లు వారు బయటకు వదులుతున్న రసాయనాల విషపు నీరు పైన మున్సిపాలిటీ కమిషనర్‌కి సిపిఐ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. కొద్ది కొద్దిగా డయింగ్ యూనిట్ల వారు రసాయనాల కలుషిత నీరును కాలువల ద్వారా కుసస్థలి నదిలోకి, చుట్టుపక్కల ఉన్న చెరువులు గుంటలోకి వదులుతూయున్నారు. కానీ ఇప్పుడు తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడున్న డైయింగ్ యూనిట్లను అద్దెకి తీసుకొని పెద్ద ఎత్తున యూనిట్లు నడుపుతున్నారు. ఇప్పుడు వృథా నీరు ఎక్కువగా కుశస్థలి నదిలో, చెరువు గుంటలోకి పోయే కాలంలో వాగై పారుతుంది. నగరి చుట్టుపక్కల ఉన్న నీరు దీని ప్రభావం వల్ల కలుషితమైంది. ఎక్కడ బోర్ వేసిన కలుషిత నీరు వస్తున్నది. దీనివల్ల నగరి ప్రాంతంలో ఉన్న ప్రజలు పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. చాలామందికి కిడ్నీ, లివరు, చర్మ వ్యాధులు, బోదకాలు గుండె జబ్బు ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. దీనిపైన మున్సిపల్ కమిషనర్ స్పందించి ఈటీవీ ప్లాంట్ లేని డైయింగ్‌ల మీద, ఈటీవీ ప్లాంట్ ఉండి ఉపయోగించకుండా ఉన్న డైయింగ్‌ల మీద చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది ఇలాగే కొనసాగితే నగరి ప్రజలని కలుపుకొని కలుషిత నీర సమస్యపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు.

## యూనిఫైడ్ కుటుంబ సర్వే పరిశీలన



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో నిర్వహిస్తున్న యూనిఫైడ్ కుటుంబ సర్వేను జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి జీవి నారాయణరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో (ఎస్‌జిఎస్ డబ్ల్యూ). తేజవతి ఆకస్మికంగా పరిశీలించారు. బుధవారం మండలంలోని సొరకాయల పాల్యం, కమ్మపల్లి, కమ్మ కండ్రిక, నడవలూరు గ్రామ పంచాయతీలలో పర్యటించి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయ సిబ్బంది యూనిఫైడ్ కుటుంబ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.. ప్రభుత్వం స్వర్ణ గ్రామం ద్వారా చేపడుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షరాంధ్ర, ఈకేవైసీ, ఇంటి పన్నులు వసూళ్లు మొదలగు అంశములపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్షరాంధ్ర రిజిస్ట్రేషన్, సీనియర్ సిటిజెన్ల ఈ కేవైసీ పూర్తి చేయాలన్నారు.. యూనిఫైడ్ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వేలో సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ, శివకుమార్, సుమలత, స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అసభ్య ప్రవర్తన

**-ఫోక్సో కేసులో నిందితుడికి 4 ఏళ్ల జైలు శిక్ష**


**అనంతపురం,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శింగనమల మండలం చిన్న మట్ల గొంది గ్రామానికి చెందిన ముత్యాల సంపత్(29) ఓ మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన కేసులో గౌరవ ఫోక్సో ప్రత్యేక న్యాయస్థానం 4 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.4,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అదేవిధంగా.., బాధితురాలికి రూ.50,000 నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2020 జూన్ 01 తేదీ ఉదయం సుమారు 8 గంటల సమయంలోముత్యాల సంపత్ 15 సంవత్సరాల మైనర్ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండగా... నీళ్లు అడగడం పేరుతో ఇంట్లోకి ప్రవేశించాడు. బాలిక నీళ్లు తీసుకురావడానికి లోపలికి వెళ్లిన సమయంలో నిందితుడు తలుపులు మూసి, గడియ పెట్టి ఆమెపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక అరవడానికి ప్రయత్నించగా, నోరు మూసి చంపుతానని బెదిరించాడు. అనంతరం బాలిక అతని నుండి తప్పించుకుని బయటకు వచ్చి జరిగిన విషయాన్ని తన పిన్నమ్మకు తెలిపింది. వారి తల్లిదండ్రులు కూలి పనుల నుండి ఇంటికి చేరుకున్న తర్వాత అదే రోజు శింగనమల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## పరిశ్రమలకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలి

**- ఆదేసించిన జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్**

**అనంతపురం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఎ.శ్యామ్ ప్రసాద్ గారి అధ్యక్షతన జిల్లా స్థాయి పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. పరిశ్రమలకు కావాల్సిన వివిధ శాఖల అనుమతులను జాప్యం లేకుండా వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. వీశిఖనవంబర్ 2024 పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న 12 ఒప్పందాల పురోగతిని సమీక్షించారు. వాటికి భూ కేటాయింపులు, అనుమతులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పెట్టుబడి రాయితీ కింద 16 పరిశ్రమలకు, వడ్డీ రాయితీ కింద ఒక పరిశ్రమకు రాయితీలను మంజూరు చేశారు.ూ్రా మీవీజు కింద జరుగుతున్న పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ పథకాల కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బ్యాంకర్లు త్వరగా రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## 28న శాకుంతలం పుస్తకావిష్కరణ



**కడప,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో భారత, భారతి పుత్తా పుల్లారెడ్డి సాహిత్య సమాలోచన జాతీయ సదస్సు ఈనెల 28వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు కడప ఐఎంఏ హాల్లో నిర్వహించడం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఇందులో పుత్తా పుల్లారెడ్డి వ్యాఖ్యానం చేసిన శృంగార శాకుంతలం(బాలా నందినీ వ్యాఖ్య) గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు ఈ శృంగార శకుంతల వ్యాఖ్యాన గ్రంథాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఆవిష్కరిస్తారని అన్నారు. ప్రసిద్ధ అవధాని మేడసాని మోహన్ సమీక్ష చేస్తారని చెప్పారు. ఇందులో ఆచార్య రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, ప్రొద్దుటూరు శాసనసభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బి జయరామిరెడ్డి, ఆచార్య శలాక రఘునాథ శర్మ, డాక్టర్ పుత్తా బాలిరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు.

## కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్



**పెండ్లిమర్రి,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలోని ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ ఐఎల్ఎన్ చంద్రశేఖర్ రావు కంప్యూటర్ ల్యాబును ప్రారంభించి, విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఆధునిక సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో ఈ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, ఏఐ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఆయా కోర్సులను అభ్యసించే విద్యార్థులకు ఈ ల్యాబ్ మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ప్రిన్సిపల్ చెప్పారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యా భివృద్ధిని పెంపొందించడంలో భాగంగా రూసా(ఆర్‌యుఎస్‌ఏ) నిధులతో ఉన్నత విద్యాశాఖ సహాయ,సహకారాలతో ఈ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వరలక్ష్మి దేవి, డా రమ్య జ్యోతి, యుగవాణి, ప్రసన్నకుమార్, నిఖిల ప్రియ, రామకృష్ణ, కుమారి శాలిని, కరీముల్లా, రమణారెడ్డి, పర్వీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి పని చేయండి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



**కడప, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు మనసు పెట్టి పని చేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయం లోని సభా భవాన్ నందు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూ రి అధ్యక్షతన జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడుతో కలసి రాజంపేట సబ్ కలెక్టర్ భావన, కడప,జమ్మల మడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డిఓలు జాన్ ఎర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి శాంతరాజ్, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ లతో రెవెన్యూ సంబంధిత అంశాలైన 22ఎ మ్యూటేషన్, వెబ్ ల్యాండ్ కరెక్షన్స్, 22 రెవెన్యూ సంబంధిత అంశాలపై మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవిన్యూ క్లినిక్‌ల నిర్వహణ ద్వారా పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

## రెవెన్యూ అధికారులు అవగాహన పెంచుకోవాలి

**- జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి**



**కడప, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రెవిన్యూ అధికారులు అన్నిరకాల జీవోలు, చట్టాలపై అవగాహన పెంచుకుని, తమ పనితీరు మెరుగుపరచుకొని బాధ్యతాయుతంగా, జవాబుదారి తనంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని సభా భవన్‌లో కడప, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లు, డీటీలు, వీఆర్వో, మండల సర్వేయర్లతో వివిధ రకాల రెవెన్యూ అంశాలపై ఒకరోజు సదస్సు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యులుగా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రెవిన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారద ర్శకత ముఖ్యమన్నారు. సమావేశంలో ఎస్డీసిలు వెంకటేశ్వర్లు, రంగస్వామి, శిరీష, కడప, జమ్మల మడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, ల్యాండ్స్ సర్వే ఎడి శాంతరాజ్, నాలుగు రెవిన్యూ డివిజన్ల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐ రోబోటిక్ ఎక్స్‌పో నిర్వహించిన సాయిబాబా హై స్కూల్ విద్యార్థులు



**కడప, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో మొట్టమొదటి సారిగా ఎ ఐ రోబోటిక్ ఎక్స్పో నిర్వహించి 100 రోబోటిక్స్ ప్రాజెక్టులను సాయిబాబా హై స్కూల్ విద్యార్థులు ప్రత్యక్షంగా ప్రదర్శించడం గర్వకారణమని తెలిపారు. అలాగే శాస్త్ర సాంకేతిక రంగంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తాయని, విద్యార్థులు పరిశోధనా దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ చైర్మన్ ఎం.వి.సాయి సుధీర్ కుమార్ రెడ్డి ప్రసంగిస్తూ ప్రస్తుత కాలంలో ఎఐ మరియు రోబోటిక్స్ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల సీఈవో ఎంపీ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత ఆవిష్కరణలపై దృష్టి పెట్టి సాంకేతిక విద్యను అభ్యసించాలని ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రతిభను ఆమె అభినందించారు. కార్య క్రమంలో హెడ్మాస్టర్ సుబ్బరాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి పనులను పరిష్కరించండి

**- సీఎంకి ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తులు**

**రాప్తాడు,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గం లోని కీలకమైన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు మంత్రులకు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి పత్రాలు అందజేశారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన సమీక్షా సమావేశం నిర్వహించగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ప్రత్యేకంగా కొన్ని అంశాలు తీసుకెళ్లారు. ఇందులో ప్రధానంగా జీడిపల్లి–పేరూరు పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ కోసం భూములిచ్చిన రైతులకు నేటి ధరల ప్రకారం పరిహారం, రాక్రీట్ సంస్థ చేసిన అక్రమాలు, హంద్రీనీవా ప్రాజెక్టు ఫేస్–2, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో లక్ష 3 వేల 362 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ డీపీఆర్ం నిధులు, రేమాండ్స్ పరిశ్రమ ఏర్పాటు వేగవంతం చేయడం వంటివి ఉన్నాయి. చెన్నేకొత్తపల్లి మండలంలో 4 వేల ఎకరాల బీడు భూములలో హార్టికల్చర్ హబ్ లేక సోలార్ హబ్ ఏర్పాటు, గోరు చిక్కుడు పరిశ్రమ కోసం నిర్మించిన భవనాల్లో ఇతర పరిశ్రమలు ఏర్పాటు, రామగిరి బంగారు గనులను మళ్లీ ప్రారంభించడం వంటి వాటిపై విన్నవించారు. వీటితో పాటు నడిమివంకకు రక్షణ గోడ, ఆత్మకూరు, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలు, పంపనూరు, పండమేరు దేవాలయాల వద్ద పార్కులు, కనీస సౌకర్యాలకు నిధులు కేటాయించాలన్న అంశాలు ఉన్నాయి.

## ఫుడ్ బాస్కెట్ ప్రారంభానికి జిల్లా స్థాయి సమీక్ష

**కడప,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైఎస్సార్ కడప జిల్లా రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కార్యాలయంలో మార్చి 8న ప్రారంభించనున్న ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం అమలుకు సంబంధించి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి మూడు మండలాల నుంచి ఫుడ్ బాస్కెట్ కమిటీ సభ్యులు, ప్రకృతి వ్యవసాయం చేపడుతున్న రైతులు, అగ్రిగేటర్లు, ఎంట్రప్రెన్యూర్లు హాజరయ్యారు. సమావేశంలో ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం లక్ష్యాలు, ప్రాముఖ్యత, అమలు విధానంపై అధికారులు చేసిన వివరణ పాల్గొన్న వారికి అవగాహన కల్పించింది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అవసరం, రైతులకు వినియోగదారులకు కలిగే ప్రయోజనాలు, అలాగే రసాయన రహిత ఆహార ఉత్పత్తుల ప్రాధాన్యతపై వివరించారు. సమావేశంలో అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనే జర్ వసంత కుమారి, హెల్త్ ,న్యూట్రిషన్ విభాగానికి చెందిన అరుణ, మార్కెటింగ్ విభాగం నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ శ్రీనాథ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సందేహాలను నివృత్తిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి: ఎంఈఓ



**పలమనేరు, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలురులో జరుగుతున్న విషయాల వారీ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖాధికారి రాజేంద్రప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమం నిర్వహణ బోధన విధానాలు ఉపాధ్యాయుల పాల్గొనడం వంటి అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులతో పరస్పర చర్చ నిర్వహించి తరగతి గదిలో విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడానికి ఆధునిక బోధన పద్ధతులు అనుసరించాలని సూచించారు. ముఖ్యంగా విషయంపైలోతైన అవగాహన కల్పించడం సాంకేతికత వినియోగం పెంపొందించడం విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యత ఇవ్వడం అవసరమని తెలిపారు. పదో తరగతి ఫలితాలను ఉత్తమంగా సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా పనితీరు తక్కువగా ఉన్న పాఠశాలలను సమీక్షించి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని గుర్తించి ప్రత్యేక శిక్షణ తరగతులు పునర్మర్శ కార్యక్రమాలు నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న పద్ధతులను తమ పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమం సక్రమంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు పి. లీలరాణి, సి.బాలసుందరం, ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శబజు, ఎం.కొటూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, పెంగరగుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, వనరుల వ్యక్తులు సమగ్ర వనరుల బృంద సభ్యులు ఇతర ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై సంతకాల సేకరణకు స్పందన

**చిత్తూరు, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బాల్య వివాహాలను అరికట్టే చర్యల్లో భాగంగా రియల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం యాదమరి మండలంలో చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మండల తహసిల్దార్ పార్థసారథి తొలి సంతకం చేసి బాల్య వివాహం విముక్తి రథంను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం, జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ సంయుక్తంగా ప్రారంభించిన వందరోజుల సంతకాల సేకరణలో భాగంగా బాల్య వివాహరహిత భారతదేశాన్ని నిర్మూలించాలని మహత్తర లక్ష్యంతో రియల్ స్వచ్ఛంద సేవా సంస్థ చేపట్టిన బాల్య వివాహ విముక్తి రథ కార్యక్రమానికి యాదమరి మండలంలో విస్తృత మద్దతు లభిస్తుండడం హర్షనీయమన్నారు. యాదమరి మండలంలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్న గిరిజన గ్రామీణ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టడం గొప్ప విషయంగా అభివర్ణించారు. కార్యక్రమంలో యాదమరి మండల ఎంపీడిఓ, ఎస్ఐ, ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రియల్ సంస్థ సీఈవో ఎస్ రామారావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్ హనీషా పవన్ రామ్, సీఎస్ బ్ల్యాలు సురేంద్రబాబు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆశాజ్యోతి డిజేబుల్ పూర్ పీపుల్ సర్వీస్ సొసైటీ కార్యాలయం ప్రారంభం



**పలమనేరు, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని గుడియాత్తం రోడ్ లోని భజంత్రీ వీధిలో ఉన్న ఆశాజ్యోతి డిజేబుల్ పూర్ పీపుల్ సర్వీస్ సొసైటీ కార్యాలయాన్ని బుధవారం తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్, స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్ చేతులు మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశాజ్యోతి డిజేబుల్ పూర్ పీపుల్ సర్వీస్ సొసైటీ వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. అనంతరం మీరు చేసే సేవా కార్యక్రమాల్లో తనకు ఒక అవకాశం కల్పించాలని తెలిపారు. అదేవిధంగా మీలో ఒక కుటుంబ సభ్యుడిగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, రామానాయుడు, హరి, రమేష్, భూలక్ష్మి, కనకమ్మ, దొరబాబు, గోవిందు, వేణు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## వీ.కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ 2వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో విజయవంతం



**పలమనేరు,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతిలోని విశ్వం హై స్కూల్‌లో 2వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి అనేక అకాడమీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలమనేరుకు చెందిన వీ.కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నుండి మొత్తం 71 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ,క్రమశిక్షణ అంకితభావాన్ని చాటిచెప్పారు. కాటా(ఫార్మ్స్) విభాగంలో అకాడమీ 18 బంగారు పతకాలు 23 రజత పతకాలు 30 కాంస్య పతకాలు కుమితే(ఫైట్) విభాగంలో సాధించారు. 7 బంగారు పతకాలు, 7 రజత పతకాలు, 11 కాంస్య పతకాలు సాధించారు. ఈ అద్భుత విజయాలతో వీ.కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, పలమనేరు గర్వంగా ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంది. ఇది అకాడమీకి మాత్రమే కాకుండా పలమనేరు పట్టణానికి కూడాగర్వకారణంగా నిలిచింది. అకాడమీ యాజమాన్యం, కోచ్‌లు నిరంతర సహకారం, ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టపడి సాధించిన విజయం ద్వారా పలమనేరు పేరు ప్రతిష్టలను పెంచిన విద్యార్థులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## అగ్ని ప్రమాదంలో బూడిదైన అల్ల నేరేడు చెట్లు

**పుంగనూరు,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం లోని పట్రపల్లి గ్రామం నందు సమయం సుమారు 12.25 గంటలకు అగ్ని ప్రమాద వచ్చింది. వెంటనే సిబ్బందితో ప్రమాద స్థలంకు వెళ్లి డి.ఎన్.సతీష్ బాబు(తండ్రి నరసింహయ్యచెట్టి)కి చెందిన నెల్లి, అల్లనేరేడు తోట 13 ఎకరాలు నందు డ్రిప్పు పైపులు, కేబులు అగ్నికి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం సేవించి ఆర్పకుండా పారవేసిన ముక్కల వలన జరిగినట్లు ఊహించడమైంది. ఈ అగ్ని ప్రమాదం నందు సుమారు రూ.1,50,000 నష్టం ఉండొచ్చు అంచనా వేశారు. అగ్ని ప్రమాదం నందు పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## మినికిలో వివాహ వేడుకకు పెద్దిరెడ్డి హాజరు



**రామసముద్రం,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని మినికి గోకుల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. వైఎస్ఆర్‌సీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం రెడ్డి ఆహ్వానం మేరకు హాజరై వధూవరులు సందీప్ రెడ్డి, మనీషాలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, వైసీపీ మండల అధ్యక్షుడు కేశవరెడ్డి, ఎంపీపీ వెంకటరమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అనంతపురం పరిసరాల్లో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేయండి

### - అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వినతికి చర్యలకు మంత్రి సవిత ఆమోదం

**అనంతపురం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగర పరిసర ప్రాంతాల్లో టెక్స్ టైల్ పార్కు ఏర్పాటు చేసి మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి నగరంలో పరిస్థితుల గురించి సభ దృష్టికి తీసుకెళ్లారు. అర్బన్ నియోజకవర్గంలో ప్రతి ఏటా జనాభా పెరుగుతోందని.. జిల్లాలోని అన్ని ప్రాంతాల వారు వచ్చి ఇక్కడ పిల్లల చదువుల కోసం, జీవనోపాధి, ఇతరత్రా వాటి కోసం స్థిరపడుతున్నారు. ఈ క్రమంలో మహిళలు చాలా మంది ఇళ్ల వద్ద ఖాళీగా ఉంటున్నారని.. వారికి పని చేయాలన్న ఆశ, అవసరం రెండూ ఉన్నాయన్నారు. మేము ఎన్నికల ప్రచార సమయంలో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు చాలా మంది సంక్షేమ పథకాల కంటే ముఖ్యంగా ఉపాధి కల్పించమని అడిగారని గుర్తుచేశారు. చాలా మంది షాపింగ్ మాల్స్, జువెలర్స్ దుకాణాల్లో చాలా తక్కువ వేతనాలకు పని చేస్తున్నారన్నారు. మహిళలు, తక్కువ చదువులకే ఆపేసిన వారు నగరంలో చాలా మంది ఉన్నారని.. ఇలాంటి వారి కోసం టెక్స్ టైల్ పార్కు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒక భారీ టెక్స్ టైల్ పార్క్ అనంతపురం నగర పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే.. చాలా మందికి ఉపాధి దొరికే అవకాశం ఉందని.. దానికి అనుబంధంగా మరికొన్ని చిన్న పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనుబంధ యూనిట్లు ద్వారా ఆర్థిక వనరులు పెరుగుతాయని దగ్గుపాటి వివరించారు. నైపుణ్యం ఆధారిత ఉపాధి ద్వారా ఈ ప్రాంతంలోని యువత, మహిళల సాధికారతకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు.

## ఇంటర్ పరీక్షలపై పోలీస్ డేగ కన్ను

### - డ్రోన్లతో పహారా కాస్తున్న అన్నమయ్య జిల్లా పోలీసులు

**మదనపల్లె,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యాధునిక డ్రోన్ కెమెరాల సహాయంతో నిఘాను ముమ్మరం చేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తూ, గుంపులుగా ఉన్న వారిని, అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తున్నారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా మరియు విద్యార్థులకు ఆటంకం కలగకుండా టెక్నాలజీని వాడుతూ పోలీస్ నిఘాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ల నిఘా కూడా ఉంటుందని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు అని పేర్కొన్నారు.


## జనసేన సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం!

### - జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బెజవాడ దినేష్

**పీలేరు,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనసేన పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీలేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బెజవాడ దినేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గురువారం నుండి రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ సభ్యత్వం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు సభ్యత్వం కార్యక్రమం క్షేత్రస్థాయి నుండి చేపట్టాలని తెలియజేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కార్యకర్తలను ఆదుకోవడానికి, కార్యకర్తల సంక్షేమ నిధి పేరుతో తమ సొంత నిధులు రెండు కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. పార్టీలో సభ్యత్వం కలిగిన వారికి ప్రమాద బీమా, అనారోగ్యంతో ఉన్నవారికి ఉచిత వైద్యం అందించి ఆదుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జ్ కళ్యాణం శ్రీనివాసులు, ఏపీ హస్త కళల కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో పీలేరు పట్టణం మార్కెట్ యార్డ్ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి జనసేన పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పీలేరు మండల అధ్యక్షులు మోహన్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి తుపాకుల గజేంద్ర, సీనియర్ నాయకులు కామిశెట్టి సుధాకర్, ధనశేఖర్, మోకాటి సుబ్బయ్య, అండే సురేష్ బాబు, ఐటి కోఆర్డినేటర్ చరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా మెలగాలి

### - ఎంఎసి చైర్మన్ పురం రామ్మూర్తి



**పీలేరు,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆటో డ్రైవర్ల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ పీలేరు మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఎన్ అమర్నాథరెడ్డి, పీలేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు విధిగా ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించి సమాజంలో బాధ్యతాయుతంగా నిజాయితీగా నడుచుకోవాలని వారు సూచించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ లైసెన్స్‌తో పాటు యూనిఫామ్‌తో కలిగి ఉండాలని కోరారు. ఆటో డ్రైవర్లను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం సంవత్సరానికి రూ.15 వేలు చొప్పున డ్రైవర్లకు ఆర్థికంగా అందించి ఆదుకుంటుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులకు నియామక పత్రాలు అందించి 150 మంది యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. బిస్మిల్లా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడులు పురం రామమూర్తి, ఉపాధ్యక్షులుగా సురేష్ బాబు సలీం నూతనంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా సెక్రటరీ శ్రీనివాసులు, పీలేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోల కిషోర్ నాయుడు, మూడే రమణ నాయక్, శ్రీనివాసులు, రాజా, ఖాదర్బాషా, మహబూబ్ బాషా, వెంకటరమణ ,వేణుగోపాల్ కుమార్, శీను తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా

## రెండు జాతీయ స్థాయి ఈవెంట్లలో ప్రతిభ కనబరచిన కుప్పం విద్యార్థి



**కుప్పం,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి భువనేశ్వరన్ రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి సాంకేతిక కార్యక్రమాల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి కళాశాలకు గౌరవం తీసుకువచ్చారని కళాశాల డాక్టర్ బిసి నాగరాజు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో 2026లో పాల్గొని కృత్రిమ మేధస్సు రంగంలో తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారన్నారు అదేవిధంగా, చెన్నైలోని ఐఐటీఎం రీసెర్చ్ పార్క్‌లో నిర్వహించిన ది కాటలిస్ట్ 2026 ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ కమర్షియలైజేషన్ కార్యక్రమంలో తన వినూత్న అగ్రి–టెక్ ప్రోటోటైప్ ఫార్మకాల్‌ను ప్రదర్శించేందుకు ఎంపికయ్యారన్నారు. ఫార్మకాల్ ప్రాజెక్ట్ వ్యవసాయ రంగంలో సాంకేతికతను వినియోగించి రైతులకు సమయానుకూల సమాచారం, సలహాలు అందించేందుకు రూపుదిద్దుకున్నదన్నారు. ఈ వేదికల ద్వారా ఆయన పరిశోధనా దృక్పథం, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా.బి.సి.నాగరాజ్ వైస్ చైర్మన్ డా.ఎన్.సునీల్ రాజ్, ప్రిన్సిపల్ డా.ఎస్.సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డా.ఎస్.బాస్కరన్, విభాగాధిపతి డా.కె.లోగేష్, అధ్యాపకులు భువనేశ్వరన్‌ను అభినందించి భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ఆవిష్కరణ భావనను పెంపొందించడం, పరిశోధనను ప్రోత్సహించడం కళాశాల లక్ష్యమని యాజమాన్యం పేర్కొంది. ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.

## చెత్త మీద పన్నువేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిది

### - పికేయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు




**రామకుప్పం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత దేశంలో ఎక్కడా లేని విధంగా గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చెత్త మీద పొన్నువేసి చెత్త పాలన సాగించారని దీనికి భిన్నంగా ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాధ్యంలో గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక వాహనాలు ఉంచి చెత్త నుండి సంపద సృష్టిస్తోందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, పికేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. గురువారం రామకుప్పం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర–స్వచంద్ర కార్యక్రమంలో భాగంగా మండలానికి కేటాయించిన స్వర్ణ రథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాలలో ప్రజలు తమ ఇంటిలోని చెత్తను వేసి పరిసరాలు పరిశుద్ధంగా ఉంచేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజు నాయక్, మాజీ మండలాధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, ఎంపీపీ సులోచన గుర్రప్ప, ఎంపీడీవో లక్ష్మి కాంత్, డిప్యూటీ తహసిల్దార్ బాలాజీ, కుప్పం నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు నరసింహులు, కడా అడ్వైసింగ్ కమిటీ మెంబర్ రఘు, క్లస్టర్ ఇంచార్జ్ రవిరెడ్డి, యూనిట్ ఇంచార్జ్ గజేంద్ర, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అల్లి శ్రీను, చంద్రారెడ్డి, బీజేపీ నేత రాజా సింహా, కుప్పం నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అవినాష్ రెడ్డి, మండల మైనార్టీ, వాణిజ్య విభాగం అధ్యక్షులు ఆదిల్ భాష, దయ, పంచాయతీ కార్యనిర్వహణాధికారి సోమశేఖర్, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## నూతన బిటి రోడ్డుకు భూమి పూజ



**రామకుప్పం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని మండల పరిధిలో పంద్యాలమడుగు పంచాయతీలో నూతన బిటి రోడ్డుకు భూమి పూజ కార్యక్రమాన్ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహ కార్యదర్శి, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ కూటమి సారాధ్యంలో గ్రామాల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు మౌలిక వసుతల కల్పన దిగ్విజయంగా యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారని పేర్కొంటూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న వాటన్నిటిని అధిగమించి ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వం తెలుగుదేశం పార్టీనేనాని పేర్కొన్నారు. రూ.44 లక్షలు అంచనాతో పల్లి కుప్పం గొల్లపల్లి రోడ్డు నుండి పంద్యాలమడుగు అరకు వరకు చేపడుతున్న ఈ రోడ్డును నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని గుత్తేదారులకు ఆయన సలహా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజు నాయక్, మాజీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ఎంపీపీ సులోచన గురప్ప, ముఖ్య నేతలు రామమూర్తి, గంటలప్ప గౌడ్ రఘు, మనోహర్, శ్రీనివాస్ గౌడ్, రాజన్న, చంద్రారెడ్డి, జనసేన పవన్ కుమార్, మాజీ ఎంపీటీసీ అల్లి శ్రీను, ఆదిల్ భాషా, పత్రా సత్తి, ఉమేష్, చంద్ర, బాలు, భాస్కర్, మండల మహిళా అధ్యక్షురాలు గీతమ్మ, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## పాల నాణ్యత, పశువుల ఆరోగ్యంపై సమీక్ష



**రామసముద్రం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని తిరుమలరెడ్డి గ్రామంలో ఉన్న అమూల్ డైరీని పశువైద్యాధికారి డాక్టర్ పావని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాల సేకరణ విధానం, నాణ్యత ప్రమాణాలు, పశువుల ఆరోగ్య పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో మాట్లాడిన ఆమె, పశువులకు సమయానికి టీకాలు వేయించి, సమతుల ఆహారం అందించాలని సూచించారు. డైరీ పరిసరాల్లో శుభ్రత పాటించాలని, పాల ఉత్పత్తి పెంపుపై దృష్టి సారిస్తే ఆదాయం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ నరేష్, అమూల్ డైరీ సెక్రటరీ సందూరి సర్దార్ బాషా, రైతులు పాల్గొన్నారు.

# రైతులు ఆదాయాన్ని ఇచ్చే ఉద్యానవన పంటల వైపు మళ్లాలి

## - డ్రోన్ల వినియోగాన్ని పెంచాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**లక్కిరెడ్డిపల్లి,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైతులు మంచి ఆదాయాన్ని ఇచ్చే ఉద్యానవన పంటలవైపు మళ్ళాలని, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం లక్కిరెడ్డిపల్లి మండలం అప్ప కొండయ్య గారి పల్లి లో ఉపాధి హామీ పనులను, దీన్నేపాడు గ్రామంలోని కోమటివాని వంక వాటర్ షెడ్ ను, రామరాజు వంక వాటర్ షెడ్ వాటర్ షెడ్ ను, కోనంపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, మామిడి తోటను, దొర్రి చెరువు, లక్కిరెడ్డిపల్లి లోని సాంఘిక సంక్షేమ హాస్టల్ను, సీసీ రోడ్ల పనులను, లక్కిరెడ్డిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. లక్కిరెడ్డిపల్లి మండలం అప్ప కొండయ్య గారి పల్లిలో ఒక మామిడి తోటలో జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. లక్కిరెడ్డిపల్లి మండలం కరువు ప్రాంతంగా ఉండడం వల్ల భూగర్భ జలాలను పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నీటి యాజమాన్య సంస్థ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సహజ వ్యవసాయ పద్ధతులను రైతులందరూ అవలంబించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గుర్తించిన ప్రాంతాలలో నీటి కుంటల పనులను త్వరగా పూర్తి చేయాలని నీతి యాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. దీన్నేపాడు గ్రామంలోని కోమటివాని వంక వాటర్ షెడ్ ను, రామరాజు వంక వాటర్ షెడ్ వాటర్ షెడ్ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ వరి పంట కాకుండా రైతులకు ఆదాయాన్ని ఎక్కువగా ఇచ్చే ఉద్యాన పంటలను పండించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం మామిడి తోటను పరిశీలించి మామిడికాయలకు ప్రభుత్వం సబ్సిడీతో అందించే కవర్లను స్వయంగా అందించారు. లక్కిరెడ్డిపల్లి లోని దొర్రి చెరువును పరిశీలిస్తూ... వర్షాకాలంలో పడే ప్రతి బొట్టును చెరువులోకి చేరవేసేలా కాలువ పనులు పూర్తవాలని ఆదేశించారు. లక్కిరెడ్డిపల్లి మండలం కోనంపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని స్వయంగా పరిశీలించారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆ హాస్టల్కు ఒక స్మార్ట్ టీవీ, ఆర్వో ప్లాంట్ను అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లక్కిరెడ్డిపల్లి లోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మీడియా వారితో మాట్లాడుతూ కరువు ప్రాంతమైన లక్కిరెడ్డిపల్లి మండలంలో ప్రాజెక్టు జలధార ద్వారా భూగర్భ జలాలు పెరిగాయని, వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా మరిన్ని నీటి వసతులు పెరుగుతాయని త్వరలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. రైతులందరూ ఉద్యాన పంటల వైపు మళ్లాలని సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పురుగుమందులను పంపిణీ చేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. రైతులకు మంచి ఆదాయం అందించే ఉద్యాన పంటలపై అవగాహన పెంచి ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన పలు గ్రామస్థులు తమ గ్రామాలకు సంబంధించిన సమస్యలను కలెక్టర్కి విన్నవించుకోగా వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహసిల్దారును, ఇతర అధికారులను ఆదేశించారు.

# అన్నమయ్య జిల్లా



# రిషిక ప్రియ కుటుంబ సభ్యులను సీఎం, మంత్రుల ఓదార్పు

## - రూ.15 లక్షల ఆర్థిక సాయం, స్థలం మంజూరుకి హామీ





**మదనపల్లె,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణం లోని నీరుగట్టువారిపల్లెకి చెందిన ఏడేళ్ల బాలిక రిషిక ప్రియ హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో బాలిక తల్లిదండ్రులు బుధవారం అమరావతిలో మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబుతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ముఖ్యమంత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15 లక్షల ఆర్థిక సాయంతో పాటు, ఇంటి స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి సహకారం అందిస్తామని బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు ఆమీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రిషిక ప్రియా ఘటన చాలా బాధాకరమని, ఆరోజు తాను అసెంబ్లీలో ఉండి ప్రతిక్షణం వారి తల్లిదండ్రులతో హోంమంత్రి అనిత, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబుతో మాట్లాడించి, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చి నేడు బాధిత కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిపించి ఇచ్చిన మాట ప్రకారం వారి కుటుంబానికి అండగా ఉన్నామని భరోసా కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు హోంమంత్రి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వద్దకు తీసుకెళ్లారు. ఘటన జరిగిన రోజు శ్రీరామ్ చినబాబు పూర్తిస్థాయిలో అండగా నిలిచిన విషయాన్ని చిన్నారి కుటుంబ సభ్యులు మంత్రులకు వివరించగా ప్రత్యేకంగా ప్రశంసించారు. ధైర్యంగా ఉండాలని మీ కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామని మంత్రులు హామీ ఇచ్చారు.

# మార్చి 2న టిడిపి పార్లమెంట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

## - రాజంపేట పార్లమెంట్ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరణ



**మదనపల్లె,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజంపేట పార్లమెంటు టిడిపి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం మార్చి 2న రామతులసమ్మ కళ్యాణ మండపంలో ఘనంగా జరుగుతుందని ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం రాజంపేట పార్లమెంట్ కార్యాలయంలో పోస్టర్లను తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్చి 2వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు రాజంపేట పార్లమెంటు టిడిపి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం వైభవంగా జరగనుందని కావున పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు కమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితోపాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యనిర్వహక కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, సోషల్ మీడియా ప్రతినిధులు కలిపి మొత్తం 41 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు నిర్వహించ బడుతుందని తెలిపారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని రాయచోటి ఎమ్మెల్యే, మంత్రి రాంప్రసాద్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, రైల్వే కోడూరు టిడిపి ఇన్ఛార్జ్ ముక్క రూపానందరెడ్డి, రాజంపేట ఇన్ఛార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు, పుంగనూరు ఇన్ఛార్జ్ చల్లా బాబురెడ్డి, తంబళ్లపల్లె టిడిపి నాయకులకు ప్రత్యేకంగా ఆహ్వానం పలుకు తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారి, రామసముద్రం సింగిల్ విండో చైర్మన్ సీతప్ప, జిల్లా ఉపాధ్యక్షులు తలారి రాధ, మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి ఎస్.ఎం.రఫీ, ఐటిడిపి అధ్యక్షులు కాశీ శ్రీరామ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి నాయకులు ప్రభాకర్, ఏఎంసీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు అరుణ్ తేజ, తెలుగు యువత పార్లమెంటు ప్రధాన కార్యదర్శి అయూబ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ముద్దుకృష్ణమ నాయుడు, యూనిట్ ఇన్ఛార్జ్ పసుపులేటి శ్రీనివాసులు, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు ప్రణయ్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కలిశం ప్రకాష్ నాయుడు, ముదివేటి శ్రీరాములు, శివాలయం చైర్మన్ కొప్పుల వెంకటరమణ, టౌన్ సెక్రటరీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విహారయాత్రలో సీనియర్ సిటిజన్స్



**మదనపల్లె, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్లో 2026న ఫిబ్రవరి 22, 23 తేదీలలో ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ జాతీయ సమావేశం ముగిసిన అనంతరం రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు ఒరిస్సా రాష్ట్రం లోని భువనేశ్వర్, చుట్టు పక్కల విహరయాత్ర స్థలాలు దర్శించుకోవడం జరిగిందని సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డా.ఎన్ మునిగోపాల కృష్ణ తెలిపారు. ఇందులో ముఖ్యంగా రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయలు తెలుసుకున్నామన్నారు. ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ జాతీయ జాయింట్ సెక్రటరి వీరారావు, ఎన్ ముని గోపాలకృష్ణ, సత్యసాయి జిల్లా నాయకులు నాగేంద్రరెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసులు తదితరులు కలసి వివిధ పుణ్య క్షేత్రాలు, చారిత్రాత్మక ప్రదేశాలు దర్శించుకున్నానని తెలిపారు. మొదట లింగరాజ్ దేవాలయం కందగిరి, కెల్స్ (గుహలు), ఉదయగిరి, దవళగిరి దర్శించు కోవడం జసరిగిందన్నారు. అనంతరం కోణార్క్ దేవాలయాన్ని, పూరి జగన్నాథ్ దేవాలయం దర్శించుకున్నామన్నారు. ఒరిస్సా పూరి జగన్నాథ్ దేవాలయంలో సినియర్ సిటిజన్స్ కోసం ఆలయ ట్రస్ట్ సభ్యులతో సంప్రదించి, సీనియర్ సిటిజెన్స్కు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేయాలని కోరినట్టు పేర్కొన్నారు.

# 'విశ్వం'లో ఇంటెలిజెంట్ రోబోటిక్స్లో జనరేటివ్ ఏఐపై వర్క్ షాప్



**మదనపల్లె/ కురబలకోట,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఇంటెలిజెంట్ రోబోటిక్స్లో జనరేటివ్ ఏఐలో ఉద్భవిస్తున్న విధానాలు అంశంపై ఒక వారం రోజుల వర్క్షాప్ను ప్రారంభించారు. ఈ వర్క్షాప్ ద్వారా విద్యార్థులకు జనరేటివ్ ఏఐపై సూత్రపరమైన అవగాహనతో పాటు ఇంటెలిజెంట్ రోబోటిక్ వ్యవస్థల్లో దాని అనువర్తనాలపై ప్రాయోగిక జ్ఞానం అందిస్తారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.డి.రమణ రెడ్డి ఆధునిక సాంకేతిక రంగాల్లో కృత్రిమ మేధస్సు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఏఐ పరిశ్రమల రూపురేఖలను ఎలా మార్చుతోందో వివరించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. వైస్ ప్రిన్సిపల్ డా.టి.ఎస్.ఘౌస్ బాషా జనరేటివ్ ఏఐ పనితీరు, దాని వినియోగాలు, ఆటోమేషన్, రోబోటిక్స్లో దాని పాత్రను వివరించారు. రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డీన్ డా.ఎం.అంజన్ కుమార్ ఇంటెలిజెంట్ రోబోటిక్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ, ఆరోగ్య, తయారీ, ఆటోమేషన్ రంగాల్లో ఏఐ సమ్మిళిత రోబోట్లు చేసే సేవలను తెలియజేశారు. పరీక్షల నియంత్రణాధికారి డా.డి.వెంకట శివ రెడ్డి ఐదు రోజుల వర్క్షాప్ అనంతరం విద్యార్థులకు రోబోటిక్ వ్యవస్థల పని విధానం, రోబోటిక్ ఇంటెలిజెన్స్లో జనరేటివ్ ఏఐ పాత్రపై స్పష్టమైన అవగాహన కలుగుతుందన్నారు. కళాశాల చైర్మన్ ఎం. ప్రభాకర్ రెడ్డి విద్యార్థులను ఉత్సాహపరుస్తూ, ఈ వర్క్షాప్ను భవిష్యత్ వృత్తి అవకాశాలకు ఉపయోగపడేలా మలచుకోవాలని సూచించారు. ఈ వర్క్షాప్ కన్వీనర్లుగా సిఎస్ఈ విభాగాధిపతి డా. ఆర్. వసంత్సెల్వకుమార్, ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి డా.వి.హేమశ్రీ మార్గదర్శనం చేస్తున్నారు. కార్యక్రమ సమన్వయకర్తగా పి. విశ్వనాథ రెడ్డి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జనరేటివ్ ఏఐ, ఇంటెలిజెంట్ రోబోటిక్స్, వాటి వాస్తవ ప్రపంచ అనువర్తనాలపై విలువైన జ్ఞానం పొందుతారు. ఏఐ, రోబోటిక్స్ రంగాల్లో వృత్తి లక్ష్యాలు కలిగిన విద్యార్థులకు ఈ వర్క్షాప్ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని భావిస్తున్నారు.

# వి.ఎల్.ఎస్.ఐ చిప్ తయారీలో ఉద్యోగావకాశాలు

## - మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ విద్యార్థులకు సెమినార్




**మదనపల్లె/ కురబలకోట, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం వారు మిట్స్ ఐఎస్ టిఈ స్టూడెంట్ చాప్టర్ వారి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం వి.ఎల్.ఎస్.ఐ టెస్టింగ్, ఫిజికల్ డిజైన్ రంగాల్లో జరుగుతున్న ఆధునిక సాంకేతికతలు అంశంపై బుధవారం విద్యార్థులకు ఒక్కరోజు సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విశాఖపట్నానికి చెందిన సిలిక్వాన్ టెక్నాలజీ సంస్థ ఫౌండర్ అండ్ సిఈఓ డాక్టర్ అష్రఫ్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి.ఎల్.ఎస్.ఐ (వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్) ఎలక్ట్రానిక్ చిప్ల తయారీలో ఫిజికల్ డిజైన్ అనగా లాజికల్గా రూపొందించిన సర్క్యూట్ నమూనా తయారీను నిజమైన చిప్(ఐసీ) రూపంలో అమలు చేసే ప్రక్రియ అన్నారు.ఐసీ తయారీలో నాలుగు ప్రధాన దశలు ఉంటాయని సెమీకండక్టర్ చిప్లు(ఐసీలు) తయారు చేయడానికి ఉపయోగించే సిలికాన్ పలకను, వేఫర్ తయారీ, నమూనా తయారీ, పరీక్షించడం వంటి వాటిని వివరించి, రెసిస్టర్లు, కెపాసిటర్లు, ట్రాన్సిస్టర్లు వంటి భాగాలను ఒకే చిన్న చిప్లో సమగ్రపరచి సిగ్నల్స్ను పంపించే విధానాన్ని వివరించారు. అలాగే టెస్టింగ్ విభాగంలో చిప్ పనితీరును పరీక్షించడం, లోపాలను గుర్తించడం, నాణ్యతను నిర్ధారించడం వంటి అంశాలను వివరించారు. వి.ఎల్.ఎస్.ఐ చిప్ తయారీ రంగంలో పరీక్షించడానికి మరియు విశ్లేషించడానికి ఉపయోగించే ప్రత్యేక సాఫ్ట్వేర్ సాధనాలు అయిన సినాప్సిస్, కాడెన్స్ వంటి వాటిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యమన్నారు. సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అమెరికా, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, ఇండియా వంటి దేశాల్లో అంతర్జాతీయ సంస్థలు అయిన ఇంటెల్, క్వాల్కామ్ వంటి కంపెనీలలో ఫిజికల్ డిజైన్ ఇంజనీర్, వెరిఫికేషన్ ఇంజనీర్, చిప్ టెస్టింగ్ ఇంజనీర్ మరియు నమూనా తయారీ ఇంజనీర్ వంటి అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ సంజయ్ కుమార్ సి.గౌర్, డాక్టర్ ఎస్.రాజశేఖరన్, కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.నాగజ్యోతి, కో-కోఆర్డినేటర్ జి.చరణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పరిరక్షణ కోసం చిరుధాన్యాల పంటలు సాగు చేసుకోవాలి



**ములకలచెరువు, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్న నేపథ్యంలో భూగర్భ జలాల పరిరక్షణ కోసం రైతులు వరి పంట సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల పప్పు దినుసులు, చిరుధాన్యాల పంటలను సాగు చేసుకోవాలని మండలం వ్యవసాయ అధికారి స్రవంతి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఏవో మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు రోజు రోజుకీ పడిపోతున్నాయని, అధిక నీటి వినియోగం చేసే వరి పంట సాగు దీనికి ప్రధాన కారణమన్నారు. ఒక ఎకరా వరి సాగుకు సుమారు 25-30 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతుంది. ఈ పరిస్థితుల్లో నీటి సంరక్షణ కోసం పంటల విధానంలో మార్పులు చాలా అవసరం మన్నారు. వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసే పప్పు ధాన్యాలు, కందులు, పెసర్లు, మినుములు, ఆయిల్ సీడ్స్ సెనగ, నువ్వులు, సోయాబీన్ జొన్న, సజ్జ, రాగి, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఈ పంటల సాగు వల్ల రైతులకు మంచి ఆదాయం కూడా వస్తుందన్నారు. అదేవిధంగా డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా నీటిని ఆదా చేయవచ్చునన్నారు. ఎరువుల వినియోగం కూడా తగ్గి పంట దిగుబడి మెరుగవుతుందన్నారు. ఈ పద్ధతులు ద్వారా భూగర్భ జలాల సంరక్షణ సాధ్యం అవుతుందన్నారు. భవిష్యత్తు తరాలకు నీటిని అందించాలంటే ఇప్పుడే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

## - ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**మదనపల్లె, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంతో పాటు, సంబేపల్లి మండలం ఎర్రగుంట్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పరీక్షలు జరుగుతున్న తీరును, పోలీసు బందోబస్తును పరిశీలించి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ కచ్చితంగా అమలు చేయాలని అపరిచిత వ్యక్తులు గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసి ఉంచాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు ఎటువంటి భయం లేదా ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్పీ భరోసా ఇచ్చారు. మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేలా పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉంటూ విద్యార్థులకు, పరీక్షా సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. తనిఖీ కార్యక్రమాల్లో ఎస్పీ వెంట రాయచోటి పట్టణ సీఐ బి.వి. చలపతి, ఎస్ఐ విష్ణువర్ధన్, సంబేపల్లి ఎస్ఐ రవికుమార్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిసి రోడ్ల నిర్మాణాలతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ



**ములకలచెరువు,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాలలో మహర్దశ నెలకొంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుడి సురేష్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కె.వి రమణలు తెలిపారు. ఈ మేరకు మొలకలచెరువు మండలం, దేవుల చెరువు పంచాయతీ, చెన్నుగారి పల్లి గ్రామంలో ఎంజిఎన్ఆర్జిఎస్ రూ.27 లక్షల నిధులతో బుధవారం సిసి రోడ్లు నిర్మాణ పనులు ముమ్మరంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో గ్రామాలలో అభివృద్ధి శూన్యంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు రోడ్ల సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు చాన్ బాషా, రవిచంద్ర, రమణారెడ్డి, నాయకులు కేశవరెడ్డి, తిరుమలరెడ్డి, ఎర్రంరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివారెడ్డి, బూత్ కన్వీనర్ కొట్టం శ్రీనివాసులు, ఈశ్వర్ రెడ్డి, పి శ్రీనివాసులు, రెడ్డప్ప, రమణమూర్తి, బుడుగు శంకర, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




# బాలీవుడ్‌కు పొలిశెట్టి పంచ్



ఇప్పుడు తెలుగులో వంద కోట్ల హీరోగా ఎదిగాడు నవీన్ పొలిశెట్టి. సంక్రాంతికి విడుదలైన తన చివరి చిత్రం అనగనగా ఒక రాజు ఈ ఘనత సాధించింది. ఈ సినిమా అంత పెద్ద విజయం సాధించింది అంటే అందులో నవీన్ క్రెడిటే అత్యధికం. నటుడిగానే కాక రైటర్‌గానూ ఈ సినిమా విజయంలో అతను కీలక పాత్ర పోషించాడు. దీని కంటే ముందు అతడి నుంచి మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి, జాతిరత్నాలు, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ లాంటి సక్సెస్ ఫుల్ సినిమాలు వచ్చాయి. కానీ అంతకంటే ముందు నటుడిగా నిలదొక్కుకోవడానికి అతను చాలా కష్టాలే పడ్డాడు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, 1 నేనొక్కడినే సహా పలు చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు చేశాడు. బాలీవుడ్‌కు వెళ్లి అవకాశాల కోసం చాలానే ప్రయత్నించాడు. అక్కడ షార్ట్ ఫిలిమ్స్ ద్వారా పేరు సంపాదించాక చిచ్చోరే సినిమాలో అవకాశం అందుకుని మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. నటుడిగా, మోడల్‌గా బాలీవుడ్‌లో ప్రయత్నాలు చేసేటపుడు తాను ఎదుర్కొన్న విచిత్రమైన అనుభవం గురించి నవీన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడాడు.

బాలీవుడ్లో మేల్ ఆర్టిస్టులకు యాక్టింగ్ టాలెంట్ కంటే కూడా సిక్స్ ప్యాక్ ఉందా లేదా అన్నదే అక్కడ ముఖ్యం కావడం తనకు ఆశ్చర్యం కలిగించినట్లు నవీన్ చెప్పాడు. తాను ముంబయిలో ఆడిషన్స్ కోసం వెళ్లినపుడు సిక్స్ ప్యాక్ చేసుకుని రమ్మని చెప్పినట్లు నవీన్ వెల్లడించాడు. సిక్స్ ప్యాక్ లేనందుకు తనను రిజెక్ట్ చేశారని కూడా అతను చెప్పాడు. ఐతే ఒక అథ్లెట్ పాత్ర చేయాల్సినపుడు సిక్స్ ప్యాక్ చేయమంటే అది అవసరమే కాబట్టి చేయడానికి ఓకే అని.. కానీ పాత్రతో సంబంధం లేకుండా సిక్స్ ప్యాక్ చేయాలనడమేంటో తనకు అర్థం కాలేదని అతనన్నాడు. తనను రిజెక్ట్ చేసింది చిప్స్ అడ్వర్టైజ్మెంట్ మోడల్‌గా అని.. సిక్స్ ప్యాక్ ఉన్నవాడు చిప్స్ ఎందుకు తింటాడో తనకు అంతుబట్టలేదని నవీన్ వ్యాఖ్యానించాడు. బాలీవుడ్‌లో సిక్స్ ప్యాక్స్ పట్ల ఎలాంటి మోజు ఉంటుందో నవీన్ ఈ ఉదాహరణతో బట్టబయలు చేశాడు. సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్ లాంటి హీరోల ప్రభావంతో బాలీవుడ్లో హీరో కావాలంటే సిక్స్ ప్యాక్ ఉండాల్సిందే అన్న ఒక ముద్ర పడిపోవడానికి దీనికి కారణమని చెప్పొచ్చు.

# శర్వానంద్ భోగికి అసలైన ఛాలెంజ్



2026 శర్వానంద్ కు చాలా స్పెషల్ ఇయర్ గా నిలవబోతోంది. సంక్రాంతి పండక్కు విపరీతమైన పోటీ మధ్య 'నారి నారి నడుమ మురారి' విజయం సాధించగా ఏప్రిల్ లో 'బైకర్' రూపంలో సరికొత్త మేకోవర్ తో ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. ఈ రెండు చాలని అభిమానులు సంతృప్తి పడతారేమో. నో ఛాన్స్. మూడోది కూడా వస్తోంది. సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న 'భోగి' ఆగస్ట్ 28 విడుదల చేయబోతున్నట్టు టీమ్ అధికారికంగా ప్రకటించింది. మంచి డేట్లకు కాంపిటీషన్ ఎక్కువగా ఉండటంతో ముందస్తు ప్లానింగ్ తో ఆరు నెలల ముందే రిలీజ్ స్లాట్ లాక్ చేసుకుంది. ఇక అసలు విషయమైన రిస్కుకు వద్దాం. ఆగస్ట్ 28 చాలా మంచి డేట్ అయినప్పటికీ దానికి కేవలం వారం రోజుల ముందే ది ప్యారడైజ్ వచ్చి ఉంటుంది. దాని మీద ఉన్న బజ్ తెలిసిందే. ఆయా షేర్ పాట వచ్చాక అంచనాలు రెట్టింపయ్యాయి. ప్యాన్ ఇండియా రేంజ్ లో రూపొందుతున్న ప్యారడైజ్ కనక బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుంటే దాని ప్రభావం ఎంతలేదన్నా సులభంగా రెండు మూడు వారాలు ఉంటుంది. ఆ మేనియాలో జనాలకు ఇతర సినిమాలు అంత ఈజీగా కనెక్ట్ కావు. అయినా అర్ భోగి టీమ్ రిస్క్ కు రెడీ అందంటే కంటెంట్ ఏదో బలంగా ఉన్నట్టే. అరవై దశకం బ్యాక్ డ్రాప్ లో రూపొందిన ఈ యాక్షన్ డ్రామాలో శర్వానంద్ లుక్ షాకింగ్ గా ఉంది. ఇప్పటిదాకా చేయని ఊర మాస్ అవతారాన్ని శర్వానంద్ భోగిలో చేస్తున్నాడు. పెద్ద ఎత్తున సెట్లు వేశారు. అవుట్ ఫుట్ ఓ రేంజ్ లో వస్తోందని యూనిట్ టాక్ ఉంది. మరి తక్కువ గ్యాప్ లో ప్యారడైజ్ తో తలపడేందుకు సిద్ధం కావడం ఆసక్తి రేపుతోంది. అయినా ఇప్పుడున్న పరిస్థితుల్లో అనౌన్స్ మెంట్ల తర్వాత కూడా ఎవరు మాట మీద ఉంటారో గ్యారెంటీగా చెప్పలేని సంకటం నెలకొంది. ప్రభాస్ నుంచి అడివి శేష్ దాకా అందరిదీ ఇదే కథ. అలాంటిది చాలా దూరంలో ఉన్న ఆగస్ట్ రిలీజులు ఖచ్చితంగా మాట మీద ఉంటాయా అంటే చెప్పలేం. ఉంటే మాత్రం నాని, శర్వా మధ్య రసవత్తరమైన మాస్ యుద్ధం చూడబోతున్నాం.

# నాని టార్గెట్ స్పష్టంగా ఉంది



నిన్న విడుదలైన ది ప్యారడైజ్ మొదటి పాట ఆయా షేర్ సోషల్ మీడియాని ఊపేస్తోంది. గతంలో ఇలాంటి పాటలు ఎవరూ చేయలేదని కాదు కానీ నాని కెరీర్ లో ఇంత మాస్ టచ్ ఉన్న సాంగ్ అరుదు కావడంతో సినీ ప్రియులు షాకవుతున్నారు. అయితే నాని తన కథల ఎంపికలో అనుసరిస్తున్న విధానం చూస్తుంటే భవిష్యత్తులో ఏ లక్ష్యం వైపు వెళ్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు మనం చూస్తున్న న్యాచురల్ స్టార్ ఎంసిఏలో పక్కింటి అబ్బాయి, నిన్ను కోరిలో భగ్న ప్రేమికుడు, మజ్నులో లవర్, పిల్ల జమీందార్ లో కాలేజీ స్టూడెంట్ కాదు. ఎలివేషన్ల ట్రెండ్లో తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటున్న న్యూ స్టార్. దసరాతో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల నానిలో ఈ మార్పుకు శ్రీకారం చుట్టాడు. దాని ఘనవిజయం నానికి కొత్త ఊపు తెచ్చింది. హిట్ 1, హిట్ 2 తానే నిర్మించినా అందులో వేరే హీరోలు నటించారు. కానీ మాస్ మేకోవర్ కోసం అలాంటి రిస్కులు తాను చేయాలని గుర్తించి హిట్ 3లో కత్తి పట్టుకున్నాడు. వర్కౌట్ అయ్యింది. అంతకు ముందు సెన్సిబుల్ సినిమాలు తీసే వివేక్ ఆత్రేయ ఒక వయొలెంట్ లైన్ చెబితే దానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి సరిపోదా శనివారంతో మరో హిట్టు ఖాతాలో వేసుకున్నాడు. ప్యారడైజ్ పాత్ర చాలా రిస్కుతో కూడుకున్నదే అయినా ఇప్పటిదాకా టాలీవుడ్ లో ఎవరూ చేయని రెండు జడల క్యారెక్టర్ కు ఓకే చెప్పాడు. క్రమంగా తన మాస్ బేస్ పెద్ద ఎత్తున బలపర్చుకునే ప్లానింగ్ లో ఉన్న నాని ఇకపై నో స్మూత్, ఎమోషనల్ మూవీస్ అంటున్నాడు. సుజిత్ తో చేస్తున్న బ్లడీ రోమియో కూడా ఫుల్ మసాలా ఉండే గ్యాంగ్ స్టర్ డ్రామా. యానిమేషన్ టీజర్ తోనే క్లారిటీ వచ్చేసింది. నెక్స్ట్ లైనప్ లో ఎవరు ఉన్నా నానికి చెప్పాల్సింది లార్జర్ దాన్ లైఫ్ సబ్జెక్టులే. కాకపోతే ఏడాదికి మూడు లేదా కనీసం రెండు సినిమాలు రిలీజ్ ఉండేలా చూసుకునే నాని ఇప్పుడు ఒకటే ఇవ్వగలిగే రేంజుకు పెరగడం అభిమానుల్లో సంతోషం, బాధ రెండూ కలిగిస్తోంది. ప్యాన్ ఇండియా స్థాయిలో మార్కెట్ సుస్థిరం చేసుకోవాలనుకున్నప్పుడు స్పీడ్ గా వెళ్ళకూడదు.



# బిజినెస్ న్యూస్



## మరోసారి ట్రంప్ టార్గెట్‌లో భారత్. . ఆ దిగుమతులపై 126 శాతం డ్యూటీ..!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. మన దగ్గరి నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే సోలార్ ఉత్పత్తులపై ప్రాథమికంగా 126 శాతం డ్యూటీ విధించారు. ఇండోనేసియాపై ప్రాథమిక సుంకాలను 86 శాతం నుంచి 143 శాతానికి పెంచారు. లావోస్‌పై 81 శాతం డ్యూటీ వేశారు. ఫారెన్ సబ్సిడీల ఆధారంగా రేటును నిర్ధరించినట్లు అమెరికా వాణిజ్య శాఖ వెల్లడించింది. ఈ మూడు దేశాల నుంచి అగ్రరాజ్యానికి దిగుమతి అవుతోన్న సెల్స్, ప్యానెల్స్ వంటి సోలార్ దిగుమతుల విలువ 4.5 బిలియన్ డాలర్లని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తమ సోలార్ ఉత్పత్తులపై ఈ దేశ ప్రభుత్వాలు అసంబద్ధ రీతిలో సబ్సిడీలు ఇస్తున్నాయని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తోంది. అమెరికా ఫస్ట్ విధానానికి ట్రంప్ తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక తయారీని ప్రోత్సహించడానికి తాపత్రయపడుతున్నారు. ఈ అధిక డ్యూటీ కారణంగా అమెరికా వినియోగదారులు సోలార్ దిగుమతులపై ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. ఇదిలాఉంటే.. ప్రపంచ దేశాలపై ఇప్పటికే ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ఈ డ్యూటీ విధింపు ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం.. మాస్టర్‌మైండ్ అతడే..




ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590కోట్ల మోసం ఘటన బ్యాంకింగ్ రంగంలో సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఈ కుంభకోణం సూత్రధారి బ్యాంకు మాజీ ఉద్యోగేనని తేలింది. బ్యాంకింగ్ ప్రక్రియను తారుమారు చేసి ప్రభుత్వానికి చెందిన ఈ నిధులను అతడు షెల్ కంపెనీలకు మళ్లించినట్లు వెల్లడైంది. దీంతో ఆ మాస్టర్‌మైండ్ సహా అతడికి సహకరించిన మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. హరియాణా లో చండీగఢ్‌లోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ శాఖలో జరిగిన మోసం కేసులో నలుగురు నిందితులను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితులను రిభవ్ రిషి, అభయ్ కుమార్, అభిషేక్ సింగ్లా, స్వాతి సింగ్లాగా గుర్తించారు. వీరిలో ఇద్దరు గతంలో ఐడీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేసిన ఉద్యోగులు కాగా.. మరో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులని పోలీసులు తెలిపారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాజీ మేనేజర్ అయిన రిభవ్ రిషి ఈ మోసానికి మాస్టర్‌మైండ్ అని, అతడే ఈ కుట్ర మొత్తాన్ని అమలుచేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రిషి చండీగఢ్‌లోని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో నిందితులను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. మోసం జరిగిందిలా.. హరియాణా ముఖ్యమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన-2.0 స్కీమ్‌కు సంబంధించిన నిధులను జమ చేసేందుకు ఆ విభాగం అధికారులు 2025 సెప్టెంబరు 26న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో రెండు ఖాతాలు తెరిచారు. తొలుత ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.50కోట్లు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో రూ.25 కోట్లు జమ చేశారు. అయితే, ఆ నిధులను వినియోగించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో ఈ ఖాతాలను మూసివేయాలని ప్రభుత్వ అధికారులు నిర్ణయించుకున్నారు. ఆ ఖాతాల్లో ఉన్న డబ్బు మొత్తాన్ని వడ్డీతో సహా మరో ఖాతాకు బదిలీ చేయాలంటూ ఈ రెండు బ్యాంకులకు ఈ ఏడాది జనవరి 13న లేఖలు పంపారు. దీంతో జనవరి 16న ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.25.45 కోట్లను హరియాణా ప్రభుత్వానికి చెందిన మరో అకౌంట్‌కు బదిలీ చేసి తమ ఖాతాను మూసేసింది. అయితే, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మాత్రం కేవలం రూ.1.27 కోట్లను మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో ఖాతాలో ఉన్న రూ.50 కోట్ల నిధులు ఏమయ్యాయని హరియాణా ప్రభుత్వ విభాగం బ్యాంకును ప్రశ్నించింది. దీనికి బ్యాంకు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విచారణ కమిటీ వేసింది. ఈ విచారణలో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఆ ఖాతా నుంచి నిధులను షెల్ కంపెనీలకు చెందిన మరో బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు తేలింది. ఈ కుట్రంతా రిభవ్ రిషినే చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బ్యాంకులో నిర్వహణపరమైన లోపాలు కూడా బయటపడ్డాయి. తప్పుల తడకగా కొన్ని లావాదేవీలను నిర్వహించినట్లు తెలిసింది. దీంతో గుట్టు లాగగా.. ప్రభుత్వ ఖాతాల్లోని మొత్తం రూ.590 కోట్ల నిధులను దారి మళ్లించినట్లు తేలింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు.. ఇప్పటికే ఆ సొమ్ము మొత్తాన్ని రికవరీ చేసినట్లు హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ వెల్లడించారు. ఈ మోసం నేపథ్యంలో ప్రభుత్వ ఖాతాలను నిర్వహించకుండా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌పై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు.

## చంద్రశేఖరన్ పునర్నియామకంపై నిర్ణయం వాయిదా



టాటా గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖరన్‌ను మూడోసారి పునర్నియమించడంపై నిర్ణయాన్ని బోర్డు వాయిదా వేసినట్లుగా తెలుస్తోంది. మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో 'కొత్త వ్యాపారాల్లో నష్టాలపై భేదాభిప్రాయాలు తలెత్తడమే' ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అలాగే చంద్రశేఖరన్ పునర్నియామకానికి టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా కొన్ని షరతులు పెట్టినట్లు అవి వెల్లడించాయి. టాటా గ్రూపులో కొన్ని కంపెనీలకు నష్టాలు వస్తున్న అంశాన్ని కూడా సమావేశంలో నోయల్ లేవనెత్తారు. అయితే ఏ కొత్త వ్యాపారమైనా, పెట్టుబడులపై ప్రతిఫలాలు రావాలంటే కొంత కాలం వేచిచూడాల్సి ఉంటుందని చంద్రశేఖరన్ పునర్నియామకానికి మద్దతిస్తున్న బోర్డు సభ్యులు పేర్కొన్నట్లు సమాచారం. పునర్నియామక కమిటీకి సారథ్యం వహిస్తున్న అనితా జార్జ్ కూడా చంద్రశేఖరన్ పునర్నియామకానికి అనుకూలంగా మాట్లాడుతూ.. కొత్త ప్రాజెక్టుల్లో నష్టాలు ఊహించినవేనని తెలిపారు. ఒకటి రెండు కంపెనీలు నష్టాల్లో ఉన్నంత మాత్రాన, గ్రూపు మొత్తం పనితీరుకు దానిని సంకేతంగా చూడలేమని కొందరు బోర్డు సభ్యులు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇన్నేళ్లుగా సంస్థ పురోగతిలో ఛైర్మన్ అందించిన సహకారాన్ని తక్కువ చేసి చూడకూడదని వాళ్లు పేర్కొన్నట్లు సమాచారం. కాగా.. చంద్రశేఖరన్ పునర్నియామకం అంశంపై ఓటింగ్ నిర్వహించాలని బోర్డు సభ్యులు ప్రతిపాదించినా, 'దీనికంటే, ఆ నిర్ణయాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని' చంద్రశేఖరన్ అన్నట్లు తెలుస్తోంది. నిర్ణయాలు తీసుకోవడంలో టాటా సన్స్, టాటా ట్రస్ట్స్ ఐక్యంగా ఉంటేనే.. టాటా గ్రూపు సమర్థంగా పనిచేయగలదని ఆయన చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ ప్రస్తుత పదవీకాలం ముగియడానికి ఇంకా ఏడాది సమయం (2027 ఫిబ్రవరి) ఉంది. 2017 నుంచి ఈ బాధ్యతల్లో ఆయన కొనసాగుతున్నారు. చంద్రశేఖరన్ హయాంలో టాటా గ్రూపునకు చెందిన 15 అతిపెద్ద నమోదిత కంపెనీల ఆదాయాలు, లాభాలు దాదాపు రెట్టింపయ్యాయి.

# కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకోండి: ఎంపి

**తిరుపతి,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో కల్తీ పాల అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో తిరుపతి లోక్‌సభ సభ్యులు మద్దిల గురుమూర్తి జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, ఆహార భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి జిల్లాలో ఎక్కడైనా కల్తీ పాలు లేదా కల్తీ ఆహార పదార్థాల విక్రయం జరుగుతుందనే అనుమానం ఉన్న ప్రాంతాల్లో వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిని ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రాలు, పాల సేకరణ కేంద్రాలు, డెయిరీలు, హోటళ్లు, స్వీట్లు తయారు చేసే దుకాణాలు, టీ స్టాళ్లు వంటి ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి నమూనాలు సేకరించాలని సూచించారు. ల్యాబ్ పరీక్షల ద్వారా పాల నాణ్యతను నిర్ధారించి, కల్తీ నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. చంటి బిడ్డలు, చిన్నపిల్లలు, వృద్ధులు రోగులు సేవించే పాలు ఆరోగ్యకరంగా ఉండాలని ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దని ఆదేశించారు. ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కి లేఖ రాశారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. అవసరమైతే టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేసే చర్యలు కూడా తీసుకోవాలని సూచించారు.

## అసెంబ్లీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



**సత్యవేడు,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు నియోజకవర్గంలో పాడుబడ్డ డిగ్రీ, జూనియర్ కళాశాలకు భవనాలు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేత్కర్ పేరిట భవనాలు నిర్మాణానికి నిధులు కేటాయించాలని అసెంబ్లీలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో తనకు మాట్లాడే అవకాశం కల్పించిన స్పీకర్ రఘురామకృష్ణరాజుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలుపుతూ.. సత్యవేడులో డిగ్రీ కళాశాల భవనం శిధిలావస్థకు చేరుకుంది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కావున నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. అలాగే పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం 30 ఏళ్ల క్రితం నిర్మించారు. తరగతి భవనాల కొరత, ప్రహరీ నిర్మాణం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలను గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఇప్పటికే వివరించాను. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెంటనే నిధులు కేటాయించి భవనం, ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలి.

# పారిపోయిన బాలుడుని తల్లిదండ్రులకు అప్పగింత



**తిరుమల,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటి నుంచి పారిపోయిన బాలుడిని అలిపిరి చెక్‌పాయింట్ వద్ద టీటీడీ భద్రతా సిబ్బంది గుర్తించి, తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం గట్‌కేసరికి చెందిన లావేటి రఘునందన్, మానస దంపతుల కుమారుడు లావేటి సుజిత్ కుమార్ ఫిబ్రవరి 14న ఇంటి నుంచి పారిపోయి తిరుపతికి చేరుకున్నాడు. అలిపిరి చెక్‌పాయింట్ వద్ద మంగళవారం అనుమానాస్పదంగా ఉన్న బాలుడిని గమనించిన టీటీడీ భద్రతా సిబ్బంది వెంటనే అతని వివరాలను సేకరించి, తల్లిదండ్రులను సంప్రదించి సమాచారం అందించారు. అనంతరం బుధవారం బాలుడిని వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. తమ కుమారుడు క్షేమంగా దొరకడంతో కుటుంబ సభ్యులు టీటీడీ అధికారులకు, భద్రతా సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# రూ.కోటి విలువైన ప్రభుత్వ భూమిని కాపాడండి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని అనుపల్లె పంచాయతీ ఉప్పలివంక గ్రామంలో రూ.కోటి విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణ నుండి తొలగించి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని మండల రెవెన్యూ తహసీల్దార్ యు మధుసూదన్ రావుకి గ్రామస్థులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఉప్పలివంక గ్రామానికి చెందిన యద్దల వెంకట్ రెడ్డి వగైరాలు సర్వేనెంబర్ 18/1 విస్తీర్ణం 5.17 సెంట్లు భూమిని ఆక్రమించుకున్నారని, ఆ భూమిలో పూర్వం శ్మశానానికి ఉపయోగించేవారుమని ఫిర్యాదులో పేర్కొంది. అలాగే ఉప్పలివంక గ్రామంలో గుట్ట పరంబోకు స్థలాలను బండి బాలచంద్రారెడ్డి, కే మంగారెడ్డి, యద్దల బాలమణి(బాలచంద్రారెడ్డి) ఎద్దుల జేజి రెడ్డి, ఇరగమారెడ్డి, జయంత్ రెడ్డిలు సుమారు 20 ఎకరాలకు పైగా వైసీపీ ప్రభుత్వంలో జెసిబిలతో చదును చేసే ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే సర్వేనెంబర్ 471కి సంబంధించి నకిలీ డీకేటి పట్టాలు, నకిలీ పాసు బుక్కు తయారుచేసి ఎద్దుల నారాయణరెడ్డి(జ్యోతిష్యులు) సుమారు 8 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గుట్ట పరంబోకు స్థలాలను కబ్జాదారులు ఆక్రమించుకోవడంతో గ్రామంలో పశువులు మేపుకునేందుకు కూడా ఇబ్బందిగా ఉందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన తాగునీటి తొట్టిన కూడా జయంత్ రెడ్డి, ఇరగం రెడ్డి, జేజిరెడ్లు ధ్వంసం చేసి స్థలాన్ని ఆక్రమించుకున్నారన్నారు. గ్రామానికి ఎగువ భాగంలో ఉన్న నారవ వద్ద ధర్మ బావి ని బండి బాలచంద్రారెడ్డి ఆక్రమించుకుని, కాలువ పరంబోకు స్థలంలోని వ్యవసాయ బోరు వేసి ఉపయోగించుకుంటున్నారన్నారు.




# ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత



**తిరుపతి,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు బుధవారం తిరుపతిలో జరుగుతున్న పలు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి, అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, పలు కీలక సూచనలు చేశారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై కఠిన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాని, పరీక్షా కేంద్రాల వద్ద గుంపులుగా నిలబడకుండా తగిన నియంత్రణ చర్యలు తీసుకుని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన భద్రతా వాతావరణం కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 100 మీటర్ల పరిధిలో అమలులో ఉన్న నిషేధాజ్ఞలను కచ్చితంగా అమలు చేయాలన్నారు.

# స్విమ్స్ - టిటిడి ప్రాణదాన పథకానికి 193 మంది పేదరోగుల ఎంపిక



**తిరుపతి,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్విమ్స్‌లో బుధవారం సాయంత్రం టిటిడి ప్రాణదాన పథకం కింద ఉచిత శస్త్ర చికిత్సలకు పేద రోగుల ఎంపిక జరిగింది. స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం కమిటి హాల్‌లో స్విమ్స్ సంచాలకులు/ ఉపకులపతి డా.ఆర్.వి.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ విభాగాలలో ఉచిత చికిత్సలకు 193 మంది పేద రోగులను ఎంపిక చేశారు. సమావేశంలో శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయ డా.శ్రీనాధ్ రెడ్డి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్, ఆర్.ఎం.ఓ. డా.వెంకట కోటిరెడ్డి, బర్డ్ హాస్పిటల్ ఆర్.ఎం.ఓ. డా.రామ్మూర్తి, టిటిడి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.కుసుమకుమారి, రుయా హాస్పిటల్ డా.సుబ్బలక్ష్మి, మెటర్నటీ హాస్పిటల్ డా. శ్రీనివాసులు, స్విమ్స్‌కు చెందిన సంబంధిత విభాగాధిపతులు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. పేషంట్ల ఆరోగ్య స్థితిగతులను, బియ్యం కార్డు కలిగి దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న నిరుపేదలను వారి అర్హతలను బట్టి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడానికి నిర్వహించిన ఈ ఎంపికలో కార్డియాలజీ విభాగంలో శస్త్ర చికిత్సలకు ఇద్దరు, కార్డియో థొరాసిక్ చికిత్సలకు 14 మంది, ఇ.ఎన్.టి.కి ఒక్కరు, జనరల్ సర్జరీలకు ఐదుగురు, మెడిసిన్ విభాగానికి 16 మంది, మెడికల్ ఆంకాలజీ విభాగంలో ఒక్కరు, నెఫ్రాలజి చికిత్సలకు 63 మంది, న్యూరాలజి-18, న్యూరో సర్జరీ-35, గైనకాలజి-04, రేడియేషన్ ఆంకాలజీ-03, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రీలజీ-29, సర్జికల్ ఆంకాలజీ- 01, యూరాలజీ-01 వంతున మొత్తం 193 మంది ఉన్నారు. పేద రోగులకు ప్రాణదానం కింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడానికి ఆర్థిక సహాయం చేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యానికి ఈ సందర్భంగా పేషంట్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి చేయూతనిచ్చే టి.టి.డి. ప్రాణదాన పథకానికి దాతలు, సంస్థలు సహృదయంతో ముందుకు వచ్చి విరివిగా విరాళాలు అందించాలన్నారు.

## అన్న క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలి: కమిషనర్



**తిరుపతి,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్న క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలని, ఎటువంటి లోపాలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో మధ్యాహ్నం భోజనం చేస్తున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 'అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. అన్నం వృథా చేయకుండా తగినంత తీసుకోవాల'ని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే తీసుకోవాలని సూచించారు. వచ్చేవారికి నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి తెలిపారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు.

# మీడియా జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు పంపిణీ



**తిరుపతి,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మీడియా జర్నలిస్టులకు 2026-27కు ప్రభుత్వం మంజూరు చేసిన అక్రిడిటేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ బుధవారం పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్‌తో బాటు సమాచార శాఖ అధికారులు, సీనియర్ మీడియా జర్నలిస్టులు ప్రకాష్, విజయ్ యాదవ్, కిరణ్, పరంధామ రెడ్డి, మునికృష్ణ, వాణి తదితరులు పాల్గొని కలెక్టర్ చేతుల మీదుగా అక్రిడిటేషన్ కార్డులు అందుకున్నారు.

## శ్రీరాముల వారి కుంభాభిషేకంలో పాల్గొన్న ఉన్నం వాసుదేవ నాయుడు దంపతులు



**తొట్టంబేడు,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉన్నం వాసుదేవ నాయుడు దంపతులు మండలం లోని తాటిపర్తి పంచాయతీ తాటిపర్తి హరిజనవాడలో నిర్వహించిన శ్రీశ్రీ రాముల వారి కుంభాభిషేక మహోత్సవంలో బుధవారం పాల్గొన్నారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఆయనతో పాటు సతీమణి, మండల ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ కూడా పాల్గొన్నారు. కుంభాభిషేక వేడుకల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వాసుదేవ నాయుడు దంపతులు అనంతరం శ్రీరాములవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. దర్శనం అనంతరం గ్రామస్థులు అష్ట ఆయురోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్ర, తాటిపర్తి గ్రామస్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# తిరుమలలో శ్రీవారి ధర్మ రథాలకు విశేష ఆదరణ

## - రోజుకు 60 వేల మంది భక్తులు ఉచిత బస్సుల్లో ప్రయాణం



**తిరుమల,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలో భక్తుల సౌకర్యార్థం టీటీడీ నిర్వహిస్తున్న శ్రీవారి ధర్మ రథాలు (ఉచిత బస్సు సేవలు) డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటుతో మరింత ప్రజాదరణ పొందుతున్నాయి. బస్సులు వచ్చే సమయాన్ని భక్తులు ముందుగానే తెలుసుకునేలా డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వేచిచూసే సమయం తగ్గి, ఉచిత రవాణా సేవలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో మొత్తం 12 ఆధునిక ఎలక్ట్రిక్ బస్సులు ఈ సేవలో ఉన్నాయి. రోజుకు సగటున 300 ట్రిప్పులు నిర్వహిస్తూ, ఒక్కో ట్రిప్పు సుమారు 6.5 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తోంది. ఈ విధానం దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోసం ప్రత్యక్ష బస్సు సమాచారం అందించే తొలి సాంకేతిక ప్రయోగంగా నిలుస్తోంది. బస్సుల ప్రత్యక్ష స్థానం, వచ్చే సమయాన్ని డిజిటల్ డిస్‌ప్లే ద్వారా భక్తులకు తెలియజేయడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజుకు సుమారు 60 వేల మంది భక్తులు ఈ ఉచిత బస్సు సేవలను వినియోగిస్తూ సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు. గతంలో ఉచిత బస్సు వచ్చే సమయం ముందుగా తెలియకపోవడంతో భక్తులు ప్రైవేట్ ట్యాక్సీల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపేవారు. దీంతో ట్యాక్సీ డ్రైవర్లు భక్తుల నుండి అధిక ధరలను వసూలు చేసేవారు. ఈ సమస్యను గుర్తించిన టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి ప్రత్యేక చొరవ తీసుకుని తిరుమలలోని 20 బస్టాప్ లలో బస్సుల ప్రత్యక్ష సమయం తెలిసేలా డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకుగాను హైదరాబాద్‌కు చెందిన బి.ఎస్.టెక్నో ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డిజిటల్ బోర్డులను విరాళంగా అందివ్వగా, ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తోంది. ఈ విధానం అమలు చేసినప్పటి నుండి బస్టాప్ వద్దకు వచ్చిన భక్తులకు బస్సు వచ్చే సమయం ప్రత్యక్షంగా తెలియడం, 10 నిమిషాల లోపే బస్సులు రావడంతో భక్తులు ఉచిత బస్సు సేవలను విరివిగా వినియోగించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ సౌకర్యం ఎంతో ఉపయోగరంగా ఉందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం ద్వారా ఇంధన వినియోగం తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా ఈ సౌకర్యం దోహదపడుతోంది. అదేవిధంగా తిరుమలలో వాహన రద్దీని తగ్గించి కాలుష్య నియంత్రణ దిశగా పటిష్టమైన ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి, భక్తులకు సౌకర్యవంతమైన, పర్యావరణ హితమైన రవాణా అందించాలనే లక్ష్యంతో టీటీడీ ఈ విధానాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం రాత్రి 9 నుండి ఉదయం 5 ఐదు గంటల వరకు ఈ ఎలక్ట్రిక్ బస్సులు 60 ట్రిప్పులు తిరుగుతుండగా భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో 20 ట్రిప్పులను పెంచనున్నారు. అదే విధంగా రాబోయే రోజుల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అదనంగా మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# నకిలీ వెబ్‌సైట్లతో అప్రమత్తంగా ఉండాలి

## - అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుకింగ్స్ చేయాలి: టీటీడీ



**తిరుమల,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలో వసతి గదులు ఇప్పిస్తామంటూ భక్తులను మోసం చేస్తున్న దళారులు, నకిలీ వెబ్‌సైట్లపై టీటీడీ అప్రమత్తమైంది. కేరళకు చెందిన భక్తుడు సి.కె. సురేష్ బాబు తిరుమలలో 'కర్ణాటక ప్రవాసి సౌధ' పేరుతో గదులు ఏర్పాటు చేస్తామని చెప్పిన వ్యక్తి చేత మోసపోయిన ఘటనపై ప్రభుత్వానికి ఫిర్యాదు అందిన నేపథ్యంలో, టీటీడీ విజిలెన్స్ విభాగం సమగ్ర విచారణ చేపట్టింది. విచారణలో తిరుమల శ్రీవారి ఆలయ చిత్రాలు, టీటీడీ పేరును అనధికారికంగా వినియోగిస్తూ నకిలీ వెబ్‌సైట్లు రూపొందించి భక్తులను తప్పుదారి పట్టిస్తున్నట్టు గుర్తించారు. గూగుల్ సెర్చ్‌లలో ఈ ఫేక్ వెబ్‌సైట్లు కనిపిస్తూ, భక్తుల నుంచి ఆన్‌లైన్ పేమెంట్ల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో, నకిలీ వెబ్‌సైట్లపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు టీటీడీ ఐటీ విభాగం ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అలాగే, టీటీడీ చిహ్నాలు, ఆలయ చిత్రాలను అనధికారికంగా ఉపయోగిస్తున్న వెబ్‌సైట్లపై కాపీరైట్ చట్టం కింద కేసులు నమోదు చేయడం జరిగింది. దర్శనం, వసతి గదులు, సేవా టికెట్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ద్వారానే మాత్రమే బుకింగ్ చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేయడమైనది. భక్తులు మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వెబ్‌సైట్లు, ఫోన్ కాల్స్‌ను వెంటనే టీటీడీ దృష్టికి తీసుకురావాలని కోరడమైనది.

## టెలికం వినియోగదారులకు మెరుగైన సేవలే ట్రాయ్ లక్ష్యం

### - సిఏజి మెంబర్ శారద



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశంలోని టెలికం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) ప్రధాన లక్ష్యమని ట్రాయ్ సీఏజి మెంబర్ శారద అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో టెలికం సేవలపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ టెలికాం సేవలు, కేబుల్ టీవీ సేవలో నాణ్యత ప్రమాణాలను సమర్థవంతంగా రూపొందించి వీటిని పటిష్టంగా అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా యాక్ట్ 1997 చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ఈ చట్టం కింద ట్రాయ్ ఒక స్వతంత్ర సంస్థను రూపకల్పన చేసిందని తెలిపారు. టెలికాం వినియోగదరుల ప్రయోజనాలను, హక్కులను కాపాడటానికి ట్రాయ్ పనిచేస్తుందని తెలిపారు. అనుచితమైన వ్యాపార ప్రకటనలను నిరోధించడానికి స్టార్ జీరో 1909 అని టైప్ చేసినట్లయితే ఏడు రోజుల్లోగా ఈ అనుచిత వ్యాపార ప్రకటనలు నిరోధించబడతాయని తెలియజేశారు. మోసపూరితమైన ఎస్ఎంఎస్‌లు, కొత్త నెంబర్ల నుంచి కాల్స్ వచ్చినప్పుడు మోసపోకుండా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో ఎలాంటి మోసపూరితమైన కాల్స్ వచ్చినప్పుడు 1930కి ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. ఆండ్రాయిడ్ ఫోన్ ల ద్వారా స్పీడ్ ఆఫ్ మై కాల్ యాప్, డు నాట్ డిస్టర్బ్ అని యాప్‌ను ట్రాయ్ వారు ఏర్పాటు చేసినారని తెలియజేశారు. ఈ సమాచారాన్ని ఆండ్రాయిడ్ మొబైల్స్ ద్వారా ఉపయోగించుకోవచ్చు అని తెలిపారు. గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బాలకృష్ణ మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ పట్ల మహిళలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027